# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 46 సంచిక : 12 విజయవాడ 20-10-2013 పేజీలు : 8 వెల : రు 5.00



లోపలి పేజీల్లో...

- అమెరికా పాలన మూసివేత : కార్మికవర్గంపై దాడికి ముసుగు
- దక్షిణాఫ్రికా : మౌలికమార్పుకై వెదుకులాడుతున్న ప్రజానీకం
- విజయసాధనలో ప్రధానాంశం పార్టీ – జనరల్ ఓ ఎన్‌గుయన్ జియాప్
- పెన్షను నిధులు : మరోసారి కార్మికులను వంచించిన పాలకులు
- గుజరాత్ : ఎన్‌కౌంటరు హత్యల నుండి పాలకులూ, అధికారులు తప్పించుకోజాలరు
- రైతాంగం పాలిట పెనుశాపం బిటిప్రత్తి
- పేదరికాన్ని అపహాస్యం చేస్తున్న పాలకులు
- ఝార్ఖండ్ : సహజవనరులపై ప్రజాహక్కుకై సదస్సు


## తక్షణ సహాయక చర్యలూ, శాశ్వత రక్షణ చర్యల ఆవశ్యకతను మరోసారి తెలిపిన ఫైలిన్ తుఫాను

**ఫైలిన్** తుఫాన్ ఒరిస్సాలోని గంజాం జిల్లానూ, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లానూ అతలాకుతలం చేసింది. తీరాన్ని దాటిన తర్వాత ఒరిస్సా, జార్ఖండ్, బీహారు రాష్ట్రాలను వర్షాల్లో ముంచెత్తింది. నదులు పొంగి జిల్లాలకు జిల్లాలే వరదమయమయ్యాయి. కడపటి వార్తల ప్రకారం తుఫాను తీరాన్ని దాటే సమయంలో ఒరిస్సాలో 21మందీ, శ్రీకాకుళంలో ఇద్దరూ మృతిచెందగా, తర్వాత వచ్చిన వరదల్లో ఒరిస్సాలో ఏడుగురు, బీహారులో 14 మంది మరణించారు. మొత్తంగా 30 జిల్లాలు తుఫాను బీభత్సానికి గురయ్యాయి.

ఈసారి భారత వాతావరణశాఖ ఐదురోజుల ముందుగానే తుఫాను హెచ్చరిక చేయగలిగింది. అది వేసిన ముందస్తు అంచనాలు–తుఫాను తీవ్రత, తీరాన్ని దాటే సమయం, చోటూ, దాటిన తర్వాత దాని పయనం, గాలి వేగం, వర్షపాతం–దాదాపు ఖచ్చితంగానే వున్నాయి. ఇది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవటాన్ని సాధ్యం చేసింది.

ఒరిస్సాలోని నాలుగు జిల్లాల్లో పదివేలమంది అశువులు బాసిన 1999 నాటి పెనుతుఫాను బీభత్సాన్ని ప్రజలు మరచిపోలేదు. ఆ విషాద అనుభవం నుండే ప్రజలు తరలివెళ్లటానికి సంసిద్ధమయ్యారు. దాదాపు పదిలక్షల మందిని తీరప్రాంతాలనుండి తరలించటం ప్రజల సంసిద్ధత వల్లనే సాధ్యపడింది.

తరలింపుకు ప్రజలు నిరాకరిస్తున్నారని గతంలో అధికారులనుండి ఫిర్యాదు తరచుగా వుండేది. తగిన సమాచారం సరైన సమయంలో అందజేస్తే ప్రజలు స్పందిస్తారని ఫైలిన్ తుఫాను నేర్పుతున్న పాఠం.

ఫైలిన్ తుఫాను సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిన చొరవ ప్రజల తరలింపుపైనే కేంద్రీకరించిసాగింది. ఇది అవసరమైనదే. అయితే అంతే చొరవ తుఫానును వెన్నంటివచ్చే వరదల ముంపుపట్ల తగినంతగా లేదని మృతుల సంఖ్య తెలుపుతున్నది. శాటిలైట్ ఫోన్‌లు పనిచేయకపోవటంవంటి లోపాలు సరిచేసుకోగలిగినవే. అయితే తుఫానును వెన్నంటి వచ్చే వైపరీత్యాల నెదుర్కొనేందుకు కూడా పకడ్బందీ ప్రణాళికలు రచించి అమలుచేయాల్సిన అవసరాన్ని ఈ అనుభవం తెలుపుతున్నది.

తుఫాను బాధితులకు తక్షణ సహాయక చర్యలలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బాగా వెనుకబడే వున్నాయి. తరలించిన ప్రజలకు వీలయినంత మేరకు సౌకర్యాలందించటంలో ప్రభుత్వ యంత్రాంగంలో సమన్వయలోపం ప్రస్ఫుటంగా కన్పించింది.

ఇక బాధితులు కోలుకునేందుకు అందించవలసిన తక్షణ సహాయ చర్యల తీరు కూడా ఇలాగే వుంది. తుఫాను కారణంగా గంజాం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ, వరదల కారణంగా బాలాసోర్, మయూర్‌భంజ్ జిల్లాల్లోనూ పంటలూ, ఆస్థుల నష్టవివరాల సేకరణ ఇంకా మొదలుకాలేదు. వేలకోట్ల రూపాయల విలువైన పంటలను రైతాంగం కోల్పోయినట్లు ప్రాధమిక అంచనాలు తెలుపుతున్నాయి. రైతాంగం కోలుకుని, సాగును పునరుద్ధరించే దిశగా వారికి తగిన సహాయమందించే చర్యలు వెంటనే చేపట్టాలి. ఈ విషయంలో ప్రభుత్వాలు అలసత్వం, కాలయాపనలనుండి బయటపడే సూచనలు కన్పించటంలేదు. బాధిత ప్రజానీకాన్ని ఆదుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని ప్రధాని హామీ యిచ్చారుగానీ, నష్టాన్ని అంచనావేసి, సహాయ నిధుల మొత్తాన్ని నిర్ణయించేందుకు ఇంతవరకూ ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చెయ్యలేదు.

బాధిత ప్రజలకు తక్షణ సహాయాన్ని అందించేందుకూ, కుంటుపడిన జీవనాన్ని, చెదరిన జీవనాధారాన్నీ పునర్నిర్మించుకునేందుకూ, రైతాంగం, వ్యవసాయకూలీలు, మత్యకారులూ, తదితర ప్రజలకు పునరావాస కార్యక్రమాలను వెనువెంటనే చేపట్టాల్సివుంది.

సుదీర్ఘ సముద్రతీరం తూర్పుకోస్తా రాష్ట్రాలకు వరంతోపాటు శాపంకూడా. చిన్నవైనా, పెద్దవైనా తుఫానుల తాకిడి వీటికి నిత్యసమస్య. తుఫానుల నష్టాన్ని వీలయినంతగా తగ్గించి, ప్రజాజీవితానికి భద్రత కల్పించగల శాశ్వత రక్షణ చర్యల ఆవశ్యకత ప్రభుత్వానికి తెలియందికాదు. అయినా ఈ శాశ్వత రక్షణ చర్యలపట్ల పూర్తి నిర్లక్ష్యాన్నే చూపుతున్నాయి.

తుఫానుల తాకిడి నెదుర్కోవటానికి ప్రకృతి ప్రసాదించిన వరం మడ అడవులు. తీరంలో సహజసిద్ధంగా పెరిగిన మడ అడవుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, అభివృద్ధిపేరిట వాటిని నరికివేసే చర్యలనే చేపడ్తున్నది.

దివిసీమ ఉప్పెన తర్వాత తుఫానుల తాకిడికి రక్షణగా తీరప్రాంతం పొడవునా సర్వీచెట్లను పెంచాలని నిర్ణయించి అమలు జరిపారు. అవి పెరిగిన తర్వాత నరికి అమ్మివేశారుగానీ, తిరిగి చెట్లు నాటే పని చేపట్టక పోవటంతో దాదాపు తీరప్రాంతమంతా రక్షణ అడవులు లేకుండానే వున్నాయి. అలాగే ఆనాడు నిర్మించిన తుఫాను షెల్టర్లు అన్నీ నేడు శిధిలమై వున్నాయి. డిజైను లోపాలతోపాటు, నిర్మాణానంతర నిర్వహణ అవసరాన్ని గుర్తించకపోవటమే దీనికి కారణం. తీరప్రాంత రక్షణకు కొంతమేరకు తోడ్పడగల కోస్తా నియంత్రణ ప్రాంత (సిఆర్‌జెడ్) గుర్తింపును వాణిజ్య ప్రయోజనాల పేర నీరుగార్చి కోస్తా నిర్వహణ ప్రాంతంగా(సిఎంజెడ్) కుదించిన ఫలితంగా కూడా తీరప్రాంత అడవులు నాశనమై తుఫానుల ముందు నిస్సహాయంగా నిలవాల్సిన స్థితి ఏర్పడింది.

ఇక్కడ మత్స్యకారులెదుర్కొంటున్న సమస్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ఫైలిన్ తుఫానులో వందలాది పడవలు సముద్రంలోకి కొట్టుకుపోయాయి. మరికొన్ని వందల పడవలు దెబ్బతిన్నాయి. వలలు తెగిపోయాయి. తుఫానుల తాకిడికి ముందుగా గురౌతున్నది వీరే. ప్రజలకు పోషక ఆహారాన్ని అందిస్తున్న వీరి జీవనోపాధికి రక్షణగా చిన్న ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం జరపాలి. మత్స్యకారులకు పక్కాయిళ్ల నిర్మాణం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో భాగంగా చేపట్టాలి. అప్పుడే వారి జీవనోపాధికి శాశ్వత రక్షణ ఏర్పడుతుంది.

ఫైలిన్ తుఫానులో 200 కి.మీ. వేగంతో వీచిన గాలులూ, 15 నుండి 20 అడుగుల వరకూ ఎగసిపడ్డ అలలూ తీరప్రాంతంలో తరచుగా ఎదురయ్యే సమస్య. గాలి ప్రవాహానికి అంతగా ఆటంకంగాని విద్యుత్తు టవర్లే కుప్పకూలిపోవటం చూసినప్పుడూ, తీరప్రాంతంలో అనుమతించిన విద్యుదుత్పత్తి కర్మాగారాల కూలింగ్ టవర్లు, పొగగొట్టాలు ఎంతవరకూ తట్టుకోగలవన్న ప్రశ్న తలెత్తుతుంది. సునామీతో జపానులోని ఫుకిషిమా అణువిద్యుత్తు కర్మాగారం 'కరిగిపోయిన' దుర్ఘటనను గుర్తుంచుకుంటే, శ్రీకాకుళంలోని కొవ్వాడ(రణస్థలం) వద్ద నిర్మించబోతున్న అణువిద్యుత్తు కర్మాగారం భద్రత ప్రశ్నార్థకమవుతున్నది. వీటి నిర్మాణాలను తుఫానుల తాకిడి దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని, ప్రత్యేకించి కొవ్వాడలో అణువిద్యుదుత్పత్తి కేంద్ర నిర్మాణాన్ని ఆపివేయవలసిన అవసరాన్ని ఫైలిన్ తుఫాను మరోసారి ముందుకు తెచ్చింది.

గత చేదు అనుభవాలనుండి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయేందుకు సిద్ధమైన తీరప్రాంత ప్రజలు జీవన పునర్నిర్మాణం కొరకు, తక్షణ సహాయ చర్యల అమలుకొరకూ; జీవనోపాధి, జీవికలకు శాశ్వత రక్షణలకు అవసరమైన విధానాల అమలును సంఘటితంగా పోరాడి సాధించుకోవాలి. ✡

## అణు విద్యుత్తు రంగంలో అమెరికా వత్తిడికి లొంగిన భారత ప్రభుత్వం

**భారత** అణువిద్యుత్తు కార్పొరేషన్‌కు, అమెరికాకు చెందిన వెస్టింగ్ హౌస్ కంపెనీకి మధ్య అణురియాక్టర్ల సరఫరాకు ఒప్పందం జరిగిందన్న వార్తలు సగం కథనాన్నే చెప్పాయి. చెప్పకుండా వున్న కథనంలో అణుప్రమాదం జరిగితే నష్టపోయే పౌరుల బాధ్యతను వహించటానికి అమెరికా (ఆమాటకొస్తే ఫ్రాన్సు, రష్యా) వ్యతిరేకతా, అణువిద్యుత్తు ఖరీదూ వున్నాయి.

ఈ ఒప్పందం ప్రకారం గుజరాత్‌లోని మితివిర్ధిలో 6వేల మెగావాట్ల అణువిద్యుదుత్పత్తికి అవసరమయ్యే ఆరు వెయ్యిమెగావాట్ల అణురియాక్టర్లను వెస్టింగ్ హౌస్ కంపెనీ భారత అణువిద్యుత్తు కార్పొరేషన్‌కు సరఫరా చేస్తుంది. వీటికయ్యే ఖర్చు 1400కోట్ల డాలర్లని అంచనా.

ఆంధ్రప్రదేశ్‌లోని రణస్థలం వద్ద అణువిద్యుత్తు కర్మాగారానికి రియాక్టర్ల సరఫరాకు జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీతోనూ, మహారాష్ట్రలోని జైత్‌పూర్ కర్మాగారానికి రియాక్టర్ల కొరకు ఫ్రాన్సుకు చెందిన అరీవా కంపెనీతోనూ, కూడంకుళానికి మరో రెండు రియాక్టర్ల కొరకు రష్యాకు చెందిన ఆటం స్ట్రాయ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీతోనూ త్వరలో ఇలాంటి ఒప్పందాలే జరగబోతున్నాయి. ఇవిగాక దేశవ్యాపితంగా ఇంకెన్నో అణువిద్యుత్తు కర్మాగారాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంగా వున్నాయి.

అణువిద్యుదుత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టిన పాలకవర్గ ముఠాలు రెండూ – యుపిఏ, ఎన్‌డిఏలు – అణువిద్యుత్తు చౌక అనీ, పెరుగుతున్న దేశవిద్యుత్తు అవసరాలను తీర్చాలంటే అణువిద్యుదుత్పత్తి చేపట్టక తప్పదన్న ప్రచారంతో తమ విధానాన్ని సమర్ధించుకున్నాయి. కాగా ఇవి రెండూ పచ్చి అబద్ధాలే. నిర్మించబూనుకున్న అణువిద్యుత్తు కర్మాగారాలన్నీ అనుకున్న సమయానికే పూర్తయినా, ఆనాటి దేశ అవసరాలలో అణువిద్యుత్తు తీర్చే భాగం 5శాతం మాత్రమే. ఇక వెస్టింగ్ హౌస్ కంపెనీతో జరిగిన ఒప్పందం ప్రకారం ఒక మెగావాట్ విద్యుత్తుకు 14కోట్ల రూ॥లు ఖర్చవుతాయి. అంటే ఆ లెక్కన ఒక యూనిటు ఖరీదు 12రూ॥లకు తగ్గదు. అలాగే కూడంకుళంలో పెట్టబోతున్న మరో రెండు యూనిట్లలో ఒక మెగావాటుకు అయ్యే ఖర్చు 20కోట్ల రూ॥లు. అంటే యూనిటు ధర 15రూ॥లకు తగ్గదు. ఇదే రష్యా కంపెనీ టర్కీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రియాక్టరును సరఫరాచేసి, అణుకర్మాగారాన్ని నిర్వహించి, నడుపుతూ యూనిటు రూ॥ 7.50కు 15ఏళ్లపాటు అమ్ముతుంది.

అణువిద్యుత్తు కర్మాగారాలలో ప్రమాదాలు జరుగుతాయి. ఆ కర్మాగారాలు ఎన్ని కబుర్లు చెప్పినా అమెరికా (లాంగ్ ఐలాండ్), రష్యా (ఛెర్నోబిల్) ఇటీవల జపాన్ (ఫుకుషిమా)లలో జరిగిన ప్రమాదాలు వాటిని నివారించలేమని తెలుపుతున్నాయి. కనుకనే 2020 నాటికి అణు విద్యుత్తు కర్మాగారాలన్నీ మూసివేస్తానని జర్మనీ ప్రకటించింది. అణువిద్యుత్తే ప్రధానంగా వున్న ఫ్రాన్సు కూడా ఇకపై కొత్త కర్మాగారాలు పెట్టబోమని చెప్పింది. అమెరికాలోగానీ, యూరపులోగానీ కొత్తగా అణువిద్యుత్తు కర్మాగారాలు నిర్మించటంలేదు. మరి మనదేశంలో వాటినెందుకు నిర్మించాలి? అణు పరిశ్రమ మూతపడకుండా భారత్‌ను మార్కెట్టుగా చేసుకోవాలని అణుకంపెనీలు ఆశించటం వల్లనే ఇలా జరుగుతోంది. అనేక తరాలపాటు వినాశం భారత ప్రజలకు, వేల కోట్ల లాభాలు సామ్రాజ్యవాదులకు!

అణు విద్యుత్తు కర్మాగారాలకు వాడుతున్న సాంకేతికపరిజ్ఞానం అత్యున్నతమైనదనీ, ప్రమాదాలు జరగవనీ, అన్నిరకాల భద్రతా చర్యలూ తీసుకున్నామనీ భారత ప్రభుత్వం చెప్పుకుంటున్నది. అంత మంచివైతే తమ దేశంలోనే ఎందుకు నిర్మించుకోరు అన్న సూటి ప్రశ్నకు సమాధానం లేదు. అయితే ఈ విమర్శకుల నోరు మూయించటానికి ఒక చట్టం చేశారు.

అణుప్రమాదానికి గురైన బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లింపు చేయటం లక్ష్యంగా చెప్పుకుంటూ భారత ప్రభుత్వం 'అణు నష్టానికి పౌరబాధ్యత చట్టం – 2010' అన్నచట్టాన్ని చేసింది. అయితే పైపైన చూసినా బాధితులకు రక్షణ కల్పించటం కంటే సరఫరాదారులైన, నిర్వహణదారులైన కంపెనీల ప్రయోజనాల రక్షణ కొరకే దీనిని చేసినట్లు కన్పిస్తుంది.

అణువిద్యుత్తు కర్మాగారాలకు యంత్రాలు పరికరాల సరఫరా చేసేది విదేశీ కంపెనీలు. భారత్‌లోని కర్మాగారాలన్నింటిని నిర్వహించి, నడిపేది అణువిద్యుత్తు కార్పొరేషను. ఒకవేళ ప్రమాదం జరిగితే ప్రజలకు కలిగిన అన్ని నష్టాలకూ పరిహారం చెల్లించేది అణువిద్యుత్తు కార్పొరేషనే. ఈ చట్టం బాధితులకు చెల్లించాల్సిన పరిహార మొత్తం రూ.1500 కోట్లకు పరిమితం చేసింది. అంతకుమించి పరిహారం చెల్లించాల్సివస్తే అదనపు వ్యయాన్ని భారత ప్రభుత్వం యిస్తుంది. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు చెల్లింపుల కోసం జరిగిన సదస్సు ఒక నిధిని ఏర్పాటు చేసింది. నష్టపరిహారం మొత్తం రూ॥1500కోట్లు దాటితే, ఈ నిధి నుండి ప్రభుత్వం 300 ఎస్.డి.ఆర్‌ల వరకూ పొందుతుంది. ప్రస్తుతం వీటి విలువ రూ.2800కోట్లు. ఇది కూడా చాలకపోతే, మిగిలినది పన్నులరూపంలో భారత ప్రజలు చెల్లించాలి.

**(తరువాయి 2వ పేజీలో)**

# ఝార్ఖండ్ సహజవనరులపై ప్రజాహక్కుకై సదస్సు

**2013** ఆగస్టు 8న, విస్థాపన్ నవనిర్మాణ్ మోర్చా ఆధ్వర్యంలో రాంచీలో ఒకరోజు సదస్సు జరిగింది. ఈ సదస్సు కుసుంబా మరియు కెరేదారి ప్రజానీకంపై కొనసాగుతున్న నిర్బంధాన్ని ఖండించటంతోపాటు, సహజ వనరులన్నింటిపై ప్రజల హక్కును పునరుద్ఘాటించింది. ఈ సదస్సుకు భూషన్ చౌదరి, జస్వాకచ్ఛప్, పి.పి.వర్మ, సునీతా మరియు అశోక్‌సింగ్‌లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఎఫ్.ఎలెక్స్ ఎక్కా సదస్సు ప్రతినిధులను ఆహ్వానిస్తూ, నిర్వాసిత ప్రజానీకపు అవస్థల గురించి వివరించారు. అరవింద్ అంజున్ సదస్సు ప్రధాన అంశాన్ని క్లుప్తంగా ప్రవేశపెట్టారు. హజారీబాగ్ జిల్లాలోని కర్ణాపురా ప్రాంత బొగ్గుగనులను లూటీ చేసుకోవటానికి ఎన్‌టిపిసికి అనుమతినిచ్చే పలు అవగాహనా ఒప్పంద పత్రాలపై ఝార్ఖండ్ ప్రభుత్వం సంతకాలు చేసిందని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. కానీ తమ సారవంతమైన భూములను ఈ ప్రయోజనం కోసం ఇచ్చేయటానికి స్థానిక ప్రజానీకం తయారీగా లేరు. అదేవిధంగా వారు, వారి ప్రాంతాలను విడిచివెళ్ళేందుకు కూడా సిద్ధమైలేరు. నీరు, అడవి, ఖనిజవనరుల లూటీనే ప్రభుత్వం అభివృద్ధిగా పరిగణిస్తోంది. కానీ ప్రభుత్వానికి దీనిపై లభించేది, నామమాత్రపు రాయల్టీనే! కాగా, అత్యధిక లాభాలను పోగేసుకునేది, కార్పొరేటు కంపెనీలు! ఈ సహజవనరుల లూటీ భారతదేశంలో ముఖ్యంగా ఝార్ఖండ్ రాష్ట్రంలో అవినీతిని పెద్దఎత్తున పెంచివేస్తోంది. సామ్రాజ్యవాదులు తమ తమ దేశాలలో సహజవనరుల నిల్వలను వెలికితీయకుండా భవిష్యత్తు కోసం భద్రపరుచుకుంటూ, మరోవైపున ఇతర దేశాల నుండి బాధ్యతారహితంగా పెద్దఎత్తున ఖనిజ నిక్షేపాలను కొల్లగొడుతున్నారు. ఇప్పటికి ప్రభుత్వం వివిధ కార్పొరేటు సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పంద అవగాహనలన్నింటినీ అమలుచేస్తే రానున్న 20-30 సం॥లలో మన సహజవనరులన్నీ ఖాళీ అవుతాయి.

'కర్ణాపురా బచావో సంఘర్ష్ సమితి' ప్రభుత్వం ముందుంచిన తన ప్రత్యామ్నాయ పథకంలో కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయవలసిందిగా ప్రతిపాదించింది. దీని ప్రకారం, రైతులు బొగ్గును తీసి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి, ఈ బొగ్గుతో విద్యుదుత్పాదన సాగిస్తారు. రైతులు కుంహర్ బైగారవిలో ఈవిధమైన పరిశ్రమను నెలకొల్పి, 10 కె.డబ్లు.హెచ్. విద్యుత్తును ఉత్పత్తిచేస్తున్నారు. కానీ ప్రభుత్వం ఇలాంటి ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవటానికి సిద్ధంగాలేదు.

కేరేదారి జిల్లాలోని పాహర్ గ్రామంలో నిర్బంధ క్రమంలో గాయాలపాలైన, తప్పుడు కేసులలో జైళ్ళపాలైన, కిడ్నాపులకు గురైనవారిని; మరియు 'కర్ణాపుర బచావో సంఘర్ష సమితి', 'ఆజాదీ బచావో ఆందోళన'ల నాయకుడైన మిథిలేష్ థాంగీలను వేదికపైకి స్వాగతం పలికి వారిని గౌరవించారు. మిథిలేష్ థాంగీ తన ప్రసంగంలో, ప్రజలపై కొనసాగుతున్న నిర్బంధాన్ని ప్రధానంగా వివరించారు. ఎన్‌టిపిసి యాజమాన్యం, కాంట్రాక్టర్లు, గూండాలు, పోలీసులు, మరియు ప్రభుత్వాధికార యంత్రాంగము ప్రజలకు వ్యతిరేకంగా జట్టుకట్టాయని ఆయన వివరించారు.

తర్వాత, విశ్రాంత న్యాయమూర్తి విక్రమాదిత్య ప్రసాద్ తన ప్రసంగంలో 'భూమిలోని ఖనిజ సంపదకు ఆ భూయజమానే హక్కుదారుడ'ని పేర్కొన్న సుప్రీంకోర్టు తీర్పును, చట్టాలపరంగా తనకున్న అభిప్రాయాలను సదస్సు ప్రతినిధుల ముందుంచారు.

రెండవ సెషన్‌లో, మిథిలేష్ డాంగి, బిర్సా హేంబ్రమ్, విజయ్‌కుమార్‌లు చర్చను నిర్వహించారు. ఉద్యమ సమస్యలు మరియు ఐక్యతపై చర్చ ప్రధానంగా కొనసాగింది. తదనంతరం, ఫాదర్ స్పెయిన్‌స్వామి సదస్సు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. విస్థాపన విరోధి నవ నిర్మాణ్ మోర్చా, ఝార్ఖండ్ ఫార్మేషన్ ఆర్గనైజేషన్‌ల ప్రతినిధులు, మరియు మేధావులు దీనిపై ప్రసంగించారు. భారతదేశం ప్రధానంగా వ్యవసాయక దేశమని, గ్రామాలతో కూడిన దేశమని, ఇక్కడి జనాభాలో దాదాపు 90శాతం ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడివున్నారని, వ్యవసాయ ఉత్పత్తులు మరియు అటవీ ఉత్పత్తులు వారి ప్రధాన జీవనాధారాలని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. దీనిని దృష్టిలోకి తీసుకున్నపుడు, రైతులపై, వ్యవసాయంపై, వ్యవసాయ, అటవీ ఉత్పత్తులపై, చిన్న మరియు కుటీర పరిశ్రమలపై హెచ్చు శ్రద్ధ వహించటం అవసరమని పేర్కొన్నారు. దేశీయ ప్రజల సాంకేతికతను, ప్రజల విజ్ఞానాన్ని, సాంప్రదాయ విత్తనాలను, పంటలను ఉపయోగించుకోవాలి తప్ప బడా పరిశ్రమలపైనా, భారీ యంత్ర సామాగ్రిపైనా, సాంకేతికతపైనా ఆధారపడరాదని, తద్వారా స్వయం ఆధారిత వ్యవస్థగా అభివృద్ధి కావాలని పేర్కొన్నారు. యంత్రాలు కేంద్రంగా, లాభాలే పరమావధిగా వున్న అభివృద్ధికి భిన్నంగా, ఉద్యోగ కల్పనతో కూడిన పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వారు నొక్కి చెప్పారు. సాధారణ ప్రజానీకపు ప్రయోజనాలను నెరవేర్చే వ్యవస్థ స్థాపన జరగనంతవరకు, నీటివనరులు, అటవీసంపద, ఖనిజవనరులన్నీ బడాకంపెనీల, ధనికవర్గ ప్రయోజనాల కొరకే తప్ప సాధారణ ప్రజానీకపు అవసరాలు తీర్చేందుకు సక్రమంగా వినియోగంలోకిరావని; కనుక, గ్రామం ప్రాతిపదికగా సహజవనరులపై ప్రజల సామూహిక హక్కు కొరకు ఆందోళనోద్యమాలను నిర్మించటం అవసరమని వక్తలు పేర్కొన్నారు. ఒక ప్రజాస్వామికమైన, న్యాయమైన అభివృద్ధి విధానాన్ని అమలుపరచటానికి ఒక ప్రజాస్వామికమైన, న్యాయమైన మరియు సమదృష్టితో పాలన సాగించగలిగే వ్యవస్థ అత్యంతావశ్యకమన్నారు. అందుకే ప్రజలు ప్రస్తుత పాలనా వ్యవస్థ స్థానే, మరో నూతన వ్యవస్థ స్థాపన కొరకు ఈ పోరాటాన్ని కొనసాగించి తీరాలని, నిర్వాసితుల హక్కుల కోసం పోరాడుతున్న, విడివిడి సంఘాలుగా వున్నవన్నీ ఒకే వేదికపైకి వచ్చి పోరాడటం ద్వారా ఐక్య, సంఘటిత శక్తిగా రూపొందగలవని పేర్కొంటూ, అందుకొరకు కృషిచేయాలన్నారు. ముగింపులో సదస్సు ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

'ఒక ప్రత్యేక సందర్భం, పరిస్థితులలో విస్థాపన వ్యతిరేక నవ నిర్మాణ మోర్చా ఈ ఒకరోజు సదస్సును నిర్వహించింది. విస్థాపనకు, తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా హజారీబాగ్ జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాలలో ప్రజల వ్యతిరేకత పెరుగుతూ వస్తోంది. ఈ విధమైన ప్రజానిరసనోద్యమాలు, ప్రభుత్వవ్యతిరేక చర్యల ద్వారా వ్యక్తమయ్యే ప్రజా ఆకాంక్షలను గుర్తించకుండా, వాటిని నిరోధించే ప్రయత్నం సాగుతోంది. వారిపై కాల్పులు కూడా జరుపుతున్నారు. అనేక రూపాలలో వారిపై నిర్బంధం ప్రయోగించబడుతోంది.

కుసుంబాలో, ఆజాదీ బచావో ఉద్యమ నాయకుడైన మిథిలేష్ డాంగీని ఈ ఉద్యమాన్ని విడిచి వెళ్ళవలసిందిగా హెచ్చరించారు. కేరేదారి గ్రామీణ ప్రజానీకం తమ జీవనానికి భంగం కలిగించే నిర్మాణ కార్యక్రమాలను అడ్డగించినందుకు దాడికి గురయ్యారు. వారిపై తూటాలను ప్రయోగించారు. గ్రామీణ పేద ప్రజానీకాన్ని అనేక తప్పుడు కేసులలో ఇరికిస్తున్నారు. జైళ్ళకు పంపుతున్నారు. ఇతర ప్రభుత్వాలవలెనే, ఇక్కడి ప్రభుత్వం కూడా నిర్బంధం, బీభత్సం, హత్యాకాండలపై ఆధారపడి తన 'అభివృద్ధి పథకాలను' అమలుజేయయత్నిస్తోంది. ఈ నిరసన ఉద్యమాలలో పాల్గొంటున్న వీరందరిపట్ల సహోదరత్వంతో ఈ చర్యలన్నింటినీ ఈ సదస్సు ముక్తకంఠంతో ఖండిస్తోంది. ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలకు వ్యతిరేకమైన చర్యలను మానుకోవాలని, ప్రజలపై నిర్బంధాన్ని ఆపివేయాలని డిమాండ్ చేస్తోంది. వీనిపై న్యాయవిచారణ జరపవలసిందిగా ఈ సదస్సు డిమాండ్ చేస్తోంది. ఈ సదస్సులో పాల్గొన్న సంస్థలన్నీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగానూ మరియు ప్రజానుకూల ప్రత్యామ్నాయ అభివృద్ధికై సమైక్య ఉద్యమాన్ని కొనసాగిస్తామ'ని ఈ తీర్మానంలో పేర్కొన్నాయి.

ఈ సదస్సులో - ఆజాదీ బచావో ఆందోళన్; సమాజ్‌వాదీ జనపరిషత్; గాంవ్ జనరాజ్యసమితి; యస్‌యుసిఐ(సి); సిపిఐ'(ఎం-ఎల్); ఝార్ఖండ్ పీపుల్స్ ఫ్రంట్, సిపిఐ(ఎం-ఎల్) పిసిసి; హూల్ ఝార్ఖండ్ క్రాంతిదళ్; జనముక్తి వాహిని; జనముక్తి సంఘర్ష్‌వాహిని; జంగల్ బచావో ఆందోళన్ సంస్థలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జమైకా, బగీఛా, విశ్వనాథ్‌బాగి, మింటూ పాశ్వాన్, డి.సి.గోహన్, ఇలిస్ ఛెవ్రా, కపూర్ బాగి, అరుణ్‌కుమార్, సిద్దేశ్వర్‌సింగ్, బిర్సాహేంబ్రమ్, శంభుమహాతో, జవీర్‌కుమార్ మరియు అనేకమంది గ్రామీణ ప్రజానీకం, విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు. ✡

# తొలితరం కమ్యూనిస్టు కా॥ భీమవరపు చంద్రశేఖర్ రెడ్డికి విప్లవజోహార్లు



**తొలితరం** కమ్యూనిస్టు, సిపిఐ(ఎం-ఎల్) ప్రగాఢ సానుభూతిపరుడు, ఆదర్శ రైతు బి. చంద్రశేఖర్‌రెడ్డి (84సం॥) ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లా ప్రొద్దుటూరులో 2013 అక్టోబరు 5వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కా॥ శేఖర్‌రెడ్డి గ్రామంలో అందరికీ తలలో నాలుకగా ఆదరణ చూరగొన్నారు. కా॥ శేఖర్‌రెడ్డి మొదటినుంచీ అప్రకటిత పార్టీ ఆర్గనైజర్‌గా అన్నిటికీ తానై నిలబడి పార్టీకి వచ్చిన కష్టనష్టాలను, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవటంలో ముందుపీఠిన నిలబడేవారు. పార్టీపై నిషేధం ఉన్నకాలంలో పార్టీ నాయకులను కాపాడుకోవటంలో, పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసిన తర్వాత రహస్యం నుండి బహిరంగంగా వచ్చిన పార్టీ శ్రేణులకు అన్ని విధాలా సహకరించటంలో ముందుండేవారు.

1943లో ప్రొద్దుటూరులో కమ్యూనిస్టు పార్టీ తొలిశాఖ స్థాపకులు అమరులు కామ్రేడ్స్ భీమవరపు వెంకటరెడ్డి, మండేపూడి నాగభూషణరెడ్డి, ఈడా సాంబమూర్తి, భీమవరపు కృష్ణారెడ్డిలతో కలసి కా॥ శేఖర్‌రెడ్డి చురుకైన కార్యకర్తగా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలికల క్రమంలో కామ్రేడ్స్ డివి, టి.యన్‌లు చూపిన ప్రజాయుద్ధపంథాల వెనుక సమీకృతమయ్యారు. అత్యవసర పరిస్థితికాలంలో నిర్బంధాలను లెక్కచేయకుండా పార్టీ శ్రేణులను కాపాడే కర్తవ్యాన్ని చేపట్టారు. 1962లో పెద్దకూతురు వివాహం సందర్భంగా గ్రామపెద్దల బెదిరింపులను లెక్కచేయకుండా గ్రామ దళితులతో సహపంక్తి భోజనాలు జరిపించటంలో ధైర్యంగా నిలబడ్డారు. గ్రామాభివృద్ధి కోసం కావలసిన స్కూలు, హాస్పిటల్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాల కోసం బాధ్యతగా కృషిచేశారు. కమ్యూనిస్టుగా శ్రమజీవులను ప్రేమించటమేగాక తానుగా శ్రమజీవనాన్ని అలవరచుకొని, వ్యవసాయంలో నూతన పద్ధతులు కనిపెట్టి ఆదర్శరైతుగా నిలిచారు. కా॥ శేఖర్‌రెడ్డి నిర్వహించిన బహుముఖ కార్యకలాపాల వెనుక ఆయన భార్య శేషమ్మ పూర్తి సహాయ సహకారాలున్నాయి.

కర్తవ్య నిర్వహణలో రాజీలేకుండా, కమ్యూనిస్టు క్రమశిక్షణతో జీవితాన్ని గడిపిన 'మొండిమనిషి' కా॥శేఖర్‌రెడ్డికి సిపిఐ(ఎం-ఎల్) కృష్ణాజిల్లా కమిటీ విప్లవజోహార్లు తెలుపుతున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నది.

కా॥ శేఖర్‌రెడ్డి మరణవార్త తెలిసిన వెంటనే పార్టీ గ్రామశాఖ సభ్యులు, పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు కదలివచ్చారు. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కోటయ్య ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. కా॥శేఖర్‌రెడ్డి అంతిమయాత్ర ఎర్రజెండాలతో, నినాదాల నడుమ సాగింది. అక్టోబరు 9వ తేదీ ఉదయం ప్రొద్దుటూరు గ్రామపంచాయితీ వద్ద జరిగిన కా॥ శేఖర్‌రెడ్డి సంస్మరణసభలో అమరజీవుల స్మారక స్థూపం నిర్మాణకమిటీ అధ్యక్షులు కా॥ ఈడా అక్కతాతయ్య, పార్టీ రాష్ట్రనాయకులు కా॥ కోటయ్య, కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ; కా॥ వీరబాబు; బి.గురవారెడ్డి, బి.రంగారెడ్డి, ఆళ్ళ సత్యనారాయణరెడ్డి, సిపియం గ్రామ నాయకులు ఈడా కోటేశ్వరరావు, జనసాహితి రాష్ట్రకార్యదర్శి కా॥ దివికుమార్ తదితరులు కా॥ శేఖర్‌రెడ్డితో తమకున్న అనుబంధం, అనుభవాలను పంచుకొని విప్లవజోహార్లు చెప్పారు.

## అణువిద్యుత్తు ... (మొదటి పేజీ తరువాయి)

కర్మాగారానికి సరఫరాదారు కంపెనీ అందించిన యంత్రాలు, ఇతర సామాగ్రిలో లోపం వల్ల లేదా నడిపే కంపెనీ నిర్వహణా లోపం వల్ల, లేదా అనేక ఇతర కారణాల వల్లా అణుప్రమాదం జరగవచ్చు. కారణమేదైనప్పటికీ అణువిద్యుత్తు కార్పొరేషను ప్రాణ, ఆస్థినష్టానికీ, దీర్ఘకాల రేడియేషన్ దుష్ప్రభావాలకు మొదట పరిహారాన్ని చెల్లిస్తుంది. యంత్రాల లోపం మూలంగా ప్రమాదం జరిగిందని తేలితే, అణువిద్యుత్తు కార్పొరేషన్‌కు నష్టపరిహారంగా యిచ్చిన సొమ్మును సరఫరాదారు చెల్లించాలి.

అసలు మోసం ఇక్కడి నుండే మొదలయింది. యంత్రాల లోపం వల్లనే ప్రమాదం జరిగినా నష్టపరిహార చెల్లింపు తాము తీసుకోబోమని అమెరికా కంపెనీలు చెబుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలలో నష్టపరిహారం అనేక వేల కోట్లు దాటుతుంది. గనుక ఆ బాధ్యత తమకుండరాదని వాటి వాదన. అలా కాకపోతే అసలు రియాక్టర్లే సరఫరా చెయ్యబోమని మొండికేశాయి.

ఈ వత్తిడికి భారత ప్రభుత్వం లొంగిపోయింది. వాటి కోర్కె తీర్చేందుకు దొడ్డిదారిని వెదికింది. భారతదేశ చట్టం ప్రకారం సరఫరాదారు నుండి నష్టపరిహారాన్ని తిరిగి పొందేహక్కు అణువిద్యుత్తు కార్పొరేషన్‌కుంది. అయితే దీనిని అణువిద్యుత్తు కార్పొరేషన్‌కూ వెస్టింగ్‌హౌస్‌కూ మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంలో చేర్చలేదు. భారత అటార్నీ జనరల్ వాహనవతి చట్టం సరిపోతుందనీ, వాణిజ్య ఒప్పందంలో దీనిని చేర్చనవసరం లేదనీ అన్నారు. అణువిద్యుత్తు కార్పొరేషన్ చెల్లించే నష్టపరిహారానికి రూ॥1500కోట్లను గరిష్ట పరిమితిగా విధించినందున, సరఫరాదారు ఆ మేరకే తిరిగి కార్పొరేషన్‌కు చెల్లిస్తాడు. ప్రమాదం యాంత్రిక లోపంవల్ల జరిగినా, ఎంత పెద్దయెత్తున నష్టం జరిగినా విదేశీ కంపెనీ చెల్లించేది రూ.1500కోట్లే. మిగిలినదంతా భారత ప్రభుత్వమే భరిస్తుంది.

రెండు : యాంత్రికలోపం వల్లనే ప్రమాదం జరిగిందని నిరూపించటం కష్టసాధ్యమైన అంశం. అంతేకాక వాణిజ్య ఒప్పదంలో వాడే పదజాలంతో అణు కార్పొరేషన్ నష్టపరిహారం తిరిగి చెల్లింపును డిమాండు చేయగల అవకాశాలు దాదాపు లేకుండా చేస్తారు. అణువిద్యుత్తు కార్పొరేషన్‌కు, వెస్టింగ్ హౌస్‌కు మధ్య జరిగిన ఒప్పందం వివరాలు బయటపెట్టలేదు. జరిగిన ఒప్పందం ప్రాథమికమనీ, రియాక్టర్ల సరఫరా ఒప్పందం తర్వాత జరుగుతుందనీ దానిని బయటపెట్టకుండా దాటవేస్తున్నారు. భోపాలు గ్యాసు ప్రమాదానికి కారణమైన యూనియన్ కార్బైడ్ కంపెనీపట్ల భారతపాలకుల ప్రేమను, దాని యజమాని ఆండర్సన్‌ను రాచమర్యాదలతో సాగనంపిన భారత పాలకుల వంచనను భారత ప్రజలింకా మరిచిపోలేదు. అణుప్రమాదం జరిగితే విదేశీకంపెనీ పట్ల భారత పాలకులు ఎలా వ్యవహరించబోతారో భోపాలు గ్యాసు ప్రమాదం తెలుపుతున్నది.

ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ రెండురోజుల అమెరికా పర్యటన ముగింపు సందర్భంగా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా "పౌర అణు కార్యక్రమంపై చర్చలలో అగణిత పురోగతి సాధించాము. అమెరికా కంపెనీకి భారత్‌కు మధ్య ఒప్పందంపై గత కొద్దిరోజుల్లోనే ఒక అంగీకారం కుదిరింది" అన్నాడు. భారత్‌లో అణువిద్యుత్తు కర్మాగారాల స్థాపనకు అవసరమైన పనులను వేగవంతం చేయమని అమెరికా, భారత్ కంపెనీలను ఇద్దరు నాయకులు కోరారు.

భారత్, అమెరికా 2008లో పౌర అణు ఒప్పందం చేసుకున్న నాటి నుండీ నష్టపరిహారం తిరిగి చెల్లింపు తీవ్రసమస్యగా ఉంటూ వచ్చింది. తమ యంత్రాల లోపం వల్ల ప్రమాదం జరిగినా నష్టపరిహారాన్ని తిరిగి చెల్లించాలన్న నిబంధన ఉండరాదని అమెరికా కంపెనీలు భీష్మించాయి. దీనిపై భారత పార్లమెంటులో ప్రతిపక్షాలు ఎన్ని సందేహాలు లేవనెత్తినా, వాటికి వివరణయివ్వలేదు. ఆకుకూపోకకూ చెందని పదజాలంతో సూటి సమాధానాలివ్వకుండా తప్పుకున్నది భారత ప్రభుత్వం.

ఇతర అంశాలలో కూడా ప్రధానమంత్రి అమెరికా వత్తిడికి లొంగిపోయాడు. చిల్లర వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడి ప్రవేశానికి నిర్దేశించిన రెండు షరతులను తొలగించటానికి ఒప్పుకున్నాడు. చిల్లర వ్యాపారంలోకి వచ్చిన విదేశీకంపెనీ 30శాతం సరకులను భారత్‌లోని చిన్న పరిశ్రమల నుండి సేకరించాలి. పదిలక్షలకు పైబడిన జనాభా వున్న నగరాలలోనే షాపులు పెట్టాలి. వీటిని వాల్‌మార్టు తీవ్రంగా వ్యతిరేకించింది. వీటిని తొలగించటానికి అమెరికా పర్యటనలో ప్రధాని అంగీకరించారు.

అలాగే పర్యావరణానికి హానికలిగిస్తున్నాయని ఫ్రిజ్‌లలో వాడే వాయువుల వినియోగాన్ని ఆపివేయాలని అమెరికా పేదదేశాలను ఆదేశిస్తున్నది. వీటి వినియోగం ఈనాటికీ అమెరికాలోనే ఎక్కువగా వుండగా, తాను మానకుండా, ఇతరులను వినియోగించవద్దనటం అన్యాయమనీ, దీని వల్ల అయ్యే ఖర్చు తమకు భరించరానిదనీ బ్రెజిల్ తదితర దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనికి నిరసనగా బ్రెజిల్ అధ్యక్షురాలు తన అమెరికా పర్యటనను రద్దుచేసుకుంది. భారత ప్రధాని మాత్రం తన పర్యటనలో అమెరికాకు లొంగిపోయాడు. ఇక్కడా దొడ్డిదారే. "ఆర్థికంగా లాభసాటైన, సాంకేతికంగా అవకాశమున్న ప్రత్యామ్నాయం" కొరకు చర్చలు సాగించేందుకు భారత్-అమెరికా టాస్క్‌ఫోర్సును ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఫ్రిజ్‌లలో వాడే వాయువులను క్రమంగా తగ్గిస్తామని అంగీకరించారు. కాకపోతే ప్రత్యామ్నాయం కోసం చర్చల పేరిట కొంత ఎక్కువ గడువు పొందారు.

ఇరు దేశాధినేతల సంయుక్త ప్రకటన భారత్, అమెరికాలను "మొదటిస్థాయి భాగస్వాము"లనీ, "అడ్డంకులను అధిగమించా"యనీ కీర్తించాయి. కానీ సారాంశంలో భాగస్వామ్యం లొంగుబాటయింది. ✡

జనశక్తి

# విజయ సాధనలో ప్రధానాంశం పార్టీ

ఓ ఎన్‌గుయన్ జియాప్

*జనరల్ జియాప్ రచించిన "వియత్నాం జాతీయ విమోచన సమరం – సాధారణ పంథా – వ్యూహం – ఎత్తుగడలు" అన్న గ్రంథంలోని 7వ అధ్యాయం నుండి కొన్ని భాగాలను ప్రచురిస్తున్నాము. జాతీయ విమోచన పోరాటాలలో ప్రజల పాత్రకూ, పార్టీ నాయకత్వ పాత్రకూ గల ప్రాముఖ్యాన్ని వివరించిన భాగాలివి.*

**– సంపాదకుడు**



**ఈనాడు** మా ప్రజలు అమెరికా దురాక్రమణ దారుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇది మా జాతి చరిత్రలోనే అతిపెద్దదైన ప్రతిఘటనా యుద్ధం.

గత శతాబ్దికాలంలో మా ప్రజలు సాగించిన విమోచనా పోరాటాల చరిత్ర, మన యుగంలో కార్మికవర్గ నాయకత్వాన మాత్రమే జాతీయ విమోచనా యుద్ధాన్ని, నిజమైన ప్రజానురంజక స్వభావం కలిగిన విప్లవ యుద్ధాన్ని సాగించటం సాధ్యమని చూపుతోంది. ఆ విధంగానే సంపూర్ణ విజయం సాధించవచ్చునని గూడ విదితమౌతోంది. సోషలిజానికి బాటవేయటానికి, దాని విజయాలను సంరక్షించుకోవటానికి ప్రజలు చేసిన తిరుగుబాటు, సాగించిన ప్రజాయుద్ధం విజయం పొందటానికి ప్రధానమైనకారణం మాపార్టీ నాయకత్వమే.

మా పార్టీ వియత్నాం కార్మికవర్గానికి చెందిన కొత్తతరహా పార్టీకావటం, పూర్తిగా విప్లవతత్వం కలిగిన పార్టీకావటం, మార్క్సిజం – లెనినిజం అనే శాస్త్రీయ సిద్ధాంతం కలిగిన పార్టీ కావటం, సుసంఘటితమైన నిర్మాణం, ఖచ్చితమైన క్రమశిక్షణ, జనసామాన్యంతో సన్నిహితమైన సంబంధాలు కలిగిన పార్టీ కావడం అందుకు కారణం.

వియత్నాంలో కార్మికోద్యమంతోను, జాతీయ విమోచనోద్యమంతోను, మార్క్సిజం – లెనినిజం తోడు చేసినందున మా పార్టీ ఆవిర్భవించింది. మా పార్టీ ఏర్పడినప్పటి నుండి విప్లవానికి ఏకైక నాయకత్వం వహిస్తోంది. అది కార్మికవర్గపార్టీ. అంతేకాదు, మొత్తం జాతికి చెందిన పార్టీ. ఈ రోజుల్లో అత్యంత విప్లవవర్గం, సోషలిస్టు తరహా వుత్పత్తికి, కార్మిక కర్షక జన సామాన్యంలోని విస్తృత ప్రజల కష్టజీవుల మౌలిక ప్రయోజనాలకు, జాతియొక్క దీర్ఘకాలిక మౌలిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే కార్మికవర్గ పార్టీ మాత్రమే జాతికి నిజమైన నాయకత్వపాత్ర నిర్వహించ గలదు. జాతీయ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాలను కాపాడగలదు. జాతీయ ప్రజాతంత్ర విప్లవాల విజయం సాధించగలదు. దేశాన్ని సోషలిజానికి గొనిపోగలదు. అలాంటి పార్టీ మాత్రమే ప్రజలు విజృంభించటానికి, విజయం సాధించేంతవరకూ విప్లవ యుద్ధం సాగించటానికీ నాయకత్వం వహించగలదు.

\ \ \

జనసామాన్యంతో సన్నిహిత సంబంధంకలిగిన మా పార్టీ యావన్మంది ప్రజల సమైక్య పోరాటానికి దృఢమైన జీవగర్రగా పనిచేస్తూ వుంది. అందువల్ల అది దేశంలో గల మరింత విస్తృతమైన శక్తులను సమీకరించగలదు. అన్ని పరీక్షలను అధిగమించి విప్లవ యుద్ధానికి విజయంచేకూర్చగలందులకై ఆ శక్తులన్నింటినీ తన వెనుక సమీకరించుకోగలదు.

యావన్మంది ప్రజల తిరుగుబాటులోను, ప్రజా యుద్ధంలోను మా పార్టీ నాయకత్వపాత్ర, రాజకీయ సైనికపంథాలను, విప్లవం యొక్క మౌలిక లక్ష్యాలను, తక్షణ లక్ష్యాలను, కర్తవ్యాలను విచక్షణా పూర్వకంగా నిర్వచించటంలో, విప్లవ కార్యాచరణ పద్ధతులను, నిర్మాణ రూపాలను, పోరాట పద్ధతులను, సాధనాలను అత్యంత అనుకూలమైన విప్లవ ఎత్తుగడలను రూపొందించటంలో, అమలుపరచటంలో విదితమౌతోంది.

**1. పార్టీ, సైన్యం, ప్రజలు యావన్మందిని రాజకీయంగా సమీకరించి నిలబెట్టడం, వియత్నాం విప్లవ యోధత్వాన్ని పెంపొందించటం; పోరాడాలని, విజయం సాధించాలని పట్టుదలను పెంపొందించటం; శతృవుపై విజయం సాధించగలందులకై అతిపెద్ద రాజకీయ – నైతిక బలగాన్ని యేర్పాటు చేయటం; ఆయా దశలకు నిర్దేశించబడిన లక్ష్యాలను, విప్లవం యొక్క అంతిమ లక్ష్యాలను ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడి సాధించటం.**

లెనిన్ దిగువ విధంగా చెప్పారు :

"చివరకు యే యుద్ధంలోనైనా విజయం, యుద్ధ రంగంలో తమ రక్తాన్ని చిందించిన సామాన్య ప్రజల ధీరత్వంపైనే ఆధారపడి ఉంటుంది. యుద్ధానికి గల ఆదర్శాలను, లక్ష్యాలను సామాన్య ప్రజలు అర్ధం చేసుకోవడానికి యెంతో ప్రాధాన్యత వుంది. అదే విజయానికి హామీగా వుంటుంది."

ఈ బోధనను పాటించి, ప్రజా యుద్ధ నిర్వహణలో, మా పార్టీ సదా ఈ లక్ష్యాన్ని పెట్టుకొంది. తన సాధారణ పంథాను, విప్లవ కర్తవ్యాలను, యుద్ధం యొక్క రాజకీయ లక్ష్యాన్ని ప్రజలు క్షుణ్ణంగా అర్ధం చేసుకొనేట్టు చేయటం, సామాన్య ప్రజానీకాన్ని రాజకీయంగా నిరంతరం సమీకరించడం, విప్లవయుద్ధం యొక్క రాజకీయ – నైతిక ప్రాధాన్యతను గూర్చి నొక్కిచెప్పటం.

ఒక యుద్ధంలో రాజకీయ – నైతిక పటిష్టత, విప్లవ పంథాను బట్టి, యుద్ధం యొక్క రాజకీయ లక్ష్యాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. మా పార్టీ చేపట్టిన విప్లవపంథా, యుద్ధం యొక్క రాజకీయ లక్ష్యమూ; చరిత్ర పరిణామ సూత్రాన్నీ, మా ప్రజల ప్రగాఢ వాంఛలనూ ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా కార్మిక – కర్షక జనసామాన్యం యొక్క వాంఛలను ప్రతిబింబిస్తాయి. ఒకసారి, ఈ పంథా జనసామాన్యాన్ని ఆకట్టుకొన్నదంటే, అది దృఢనిశ్చయాన్ని రేకెత్తించుతుంది. విప్లవ యుద్ధానికి బలమైన చోదకశక్తిగా రూపొందుతుంది. యుద్ధక్రమంలో మా పార్టీ, ఓర్మితోనూ, క్రమపద్ధతిలోనూ విప్లవపంథాను, కర్తవ్యాలను, యుద్ధం యొక్క లక్ష్యాన్ని గూర్చి తన సభ్యులకు, సైన్యానికి ప్రజలకు ప్రబోధించింది. వివిధ శక్తుల బలాబలాలను సవ్యంగా అంచనా వేయటాన్ని గూర్చి వారికి బోధించింది. పరిణామక్రమాన్ని గమనించటానికి, విప్లవ యుద్ధం యొక్క స్వభావాన్ని అవగాహన చేసుకొనటానికి, దీర్ఘకాలికమైనా, కష్టాలతో కూడుకున్నదే అయినా చివరకు తప్పక విజయం పొందే ఆ యుద్ధ స్వభావాన్ని గూర్చి వారికి వివరించి చెప్పటం జరిగింది. రాజకీయ విద్యాబోధనను, సిద్ధాంత విజ్ఞానాన్ని సైన్యంలోను, ప్రజలలోను నిరంతరం వుధృతంగా సాగించింది. వారి వర్గచైతన్యాన్ని, జాతీయ చైతన్యాన్ని, దేశభక్తిని, జనతా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎడల, సోషలిస్టు ప్రభుత్వం ఎడల ప్రేమను, కార్మికవర్గ అంతర్జాతీయతనూ పెంపొందించింది. "స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకంటే అమూల్యమైనదేదీ లేదు" అని అధ్యక్షుడు హోచిమిన్ వ్యక్తం చేసిన గొప్పసత్యాన్ని, "స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, తిరిగి బానిసత్వం పాలబడటం కంటే సర్వస్వాన్ని త్యాగం చెయ్యా"లని, పోరాడాలనే దృఢనిశ్చయాన్ని మా పార్టీ ప్రజలలో విరివిగా ప్రచారం చేసింది. మాతృభూమికే పూర్తిగా అంకితమైపోయేట్లు సన్నద్ధం చేసింది. పెడధోరణులకు వ్యతిరేకంగా నిరంతరమూ పోరాడింది. దీర్ఘకాలిక యుద్ధంలో, అగ్నిపరీక్షకు గురవుతున్న సందర్భంలో ఎలాంటి వూగిసలాటకైనా వ్యతిరేకంగా ప్రత్యేకించి పోరాడింది.

వియత్నాం ప్రజలందరిలో విప్లవ యోధత్వాన్ని పెంపొందించటంలో విజయవంతమయింది. సమిష్టి వీరత్వం అత్యున్నత స్థాయికి గొనిపోబడింది. సైన్యంలో వున్నా, ప్రజలలోవున్నా, అగ్రశ్రేణి పోరాటరంగంలో వున్నా, వెనుకతట్టు ప్రాంతంలోవున్నా, అన్ని పోరాట స్థానాలలోను, విప్లవ యుద్ధంలోని అన్ని రంగాలలోను గల లక్షలాది ప్రజలకది నూతనమైన విశిష్ట లక్షణంగా రూపొందింది.

\ \ \

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు సాధించుకోవాలని, విప్లవం సాధించిన విజయాలను కాపాడుకోవాలని మా ప్రజలు ప్రదర్శించే దృఢసంకల్పంలో, వియత్నాం విప్లవ వీరత్వం ప్రతిబింబిస్తోంది. పాత ప్రభుత్వపాలన క్రింద వర్ణనాతీతమైన దుర్భర పరిస్థితులకు లోనైన మా ప్రజలు, నూతన ప్రభుత్వం తమకు కల్పించిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను నిలబెట్టుకునేందుకు తుదికంటా పోరాడాలన్న స్థిర నిర్ణయానికొచ్చారు.

వియత్నాం విప్లవ వీరత్వం, నిరంతరం సాగించిన విజ్ఞాన ప్రచారాన్ని, సిద్ధాంతాలు, సూత్రాల విషయంలో, విప్లవ భావాల విషయంలో నిత్యమూ శిక్షణ గరపటాన్ని జోడించినదానికి ఫలితమే. విప్లవ కర్తవ్యాలను, యుద్ధం యొక్క లక్ష్యాన్ని, ప్రగాఢమైన దేశభక్తిని, శత్రువుపై విపరీతమైన ద్వేషం, పోరాడి విజయం సాధించాలన్న దృఢనిశ్చయం, పార్టీపైన, అధ్యక్షుడు హోచిమిన్‌పైన అచంచల విశ్వాసం, జాతికి, కార్మికవర్గానికి గల బలంపైన, వీరోచిత సాంప్రదాయాలపైన విశ్వాసం, సమిష్టిగాను, వ్యక్తిగతంగాను తమకుగల ప్రతిఘటనా శక్తిపైన విశ్వాసం–– వీటన్నింటి ఎడ పూర్తిగా శ్రద్ధతో వ్యవహరిస్తున్న విషయాన్నది విదితం చేస్తోంది.

మా ప్రజలకు, మా జాతికి గల అపారమైన నైతికబలం, నూతన శకంలో, నూతన సాంఘిక ఆధిపత్యం క్రింద వియత్నాం ప్రజల జీవన విధానాన్ని, మాతృభూమిని సంరక్షించుకొనటానికై భీషణ పోరాటం సాగించవలసిన ఆవశ్యకతను వియత్నాం విప్లవ వీరత్వం ప్రతిబింబిస్తుంది.

\ \ \

**2. ప్రజాయుద్ధం యొక్క శక్తినంతటినీ సమీకరించటం; విప్లవ కర్తవ్యాలను క్రమక్రమంగా నిర్వర్తిస్తూ, యుద్ధాన్ని ఉధృతం చేయటం; యుద్ధంలో అంతిమ విజయం సాధించటం కోసం విజయసాధనకు ఉపకరించే అంశాలను పటిష్టమొనరించటం జరుగుతోంది.**

లెనిన్ ఇలా చెప్పారు :

"ఏ పక్ష ప్రజలకు ఎక్కువ రిజర్వులున్నాయో, బలానికి ఎక్కువ జనులు, ఎక్కువ సహనశక్తి వున్నాయో ఆ పక్షానికే యుద్ధంలో విజయం లభిస్తుంది."

మా విమోచనా యుద్ధాలలో, మేము ఎల్లప్పుడూ "పెద్ద సైన్యానికి వ్యతిరేకంగా చిన్న బలగాన్ని మోహరిస్తాం. సైనిక సంఖ్యా బలంలో మా కంటె ఆధిక్యతగల శత్రువును ఓడిస్తాం." విజయం సాధించటం కోసం, మేము శత్రువు కంటే ఆధిక్యత గల బలాన్ని నిర్మించుకోవాలి. సామ్రాజ్యవాద దురాక్రమణదారు దోపిడీమూకలకు వ్యతిరేకంగా మా ప్రజల యావన్మంది శక్తిని, మా జాతిశక్తినంతటిని మోహరించి నిలుపుతాం. జాతినంతటినీ రాజకీయంగా సమీకరించటం ప్రాతిపదికపై, ప్రజాయుద్ధం యొక్క శక్తులన్నింటినీ సమీకరించటానికి, విజయసాధనకనుకూలమైన అంశాలను పెంపొందించటానికీ మా పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది.

ఫ్రెంచి వలసాధిపతులకు వ్యతిరేకంగా సాగించిన ప్రతిఘటనా యుద్ధంలో, అధ్యక్షుడు హోచిమిన్ ఇలా పేర్కొన్నాడు : "జాతీయ ఐక్య సంఘటనను పటిష్ట మొనరించి, విస్తృతం చేయటం, కార్మిక–కర్షక మైత్రిని, ప్రజల అధికారాన్ని పటిష్టమొనరించటం, సైన్యాన్ని తిరిగి కూడదీసి నిర్మాణం చేయటం, పార్టీని, అన్ని రంగాలలోను పార్టీ నాయకత్వాన్ని పటిష్టమొనరించటంలోనే విజయ రహస్యం ఇమిడి వుంది"

\ \ \

మా జాతికి సాధ్యమైనంత అత్యధిక శక్తిని కల్పించగలందులకై ఈ అంశాలన్నింటినీ ఒక క్రమ పద్ధతిలో రూపొందించి, పెంపొందించటానికి; ప్రపంచ ప్రజల నుండి విస్తృతమైన, చురుకైన సహాయం పొందటానికి మా పార్టీ కృషి చేసింది.

ఈ లక్ష్యాన్ని దృష్టిలో వుంచుకునే, మా పార్టీ ప్రత్యేకించి ఈ ప్రాథమిక సమస్యను చేపట్టింది; విప్లవ యుద్ధాన్ని వుధృతం చేయటానికి, యుద్ధం సాగించే క్రమంలోనే విప్లవ కర్తవ్యాలను క్రమక్రమంగా సాధించటానికి మధ్యగల సంబంధాన్ని విచక్షణా పూర్వకంగా నిర్ణయించటం.

మా ప్రజల విప్లవ లక్ష్యానికి తూట్లు పొడవాలని, విప్లవ ప్రతీఘాతయుద్ధం సాగించబడుతున్న పరిస్థితులలో, విప్లవం యొక్క కీలక కర్తవ్యాలను సాధించేందుకు దోహదపడే అత్యంత నిర్ణయాత్మకమైన సాధనం విప్లవ యుద్ధమేనని మా పార్టీ అభిప్రాయం. అందువల్ల, యుద్ధం యొక్క రాజకీయ లక్ష్యాలను పూర్తిగా అవగాహన చేసుకోవటం ద్వారాను, విజయం సాధించేంతవరకు, సామ్రాజ్యవాదుల, వాళ్ళ తొత్తుల ఆధిపత్యాన్ని కూల ద్రోసేందుకుగాను విజయం సాధించేవరకూ దృఢ నిశ్చయంతో పోరాటం ద్వారా మాత్రమే విప్లవం యొక్క మౌలిక లక్ష్యాలు సాధించబడగలవని కూడా మా పార్టీ అభిప్రాయబడుతోంది. పైగా, విప్లవశక్తులను కూడదీసి, నిర్మాణరూపం కల్పించేందుకుగాను, విజయానికి అనుకూలమైన అంశాలను పెంపొందించేందుకుగాను, అన్ని రంగాలలోను, (తరువాయి 4వ పేజీలో)

## వియత్నాం కమ్యూనిస్టుపార్టీ అగ్రనేత జనరల్ ఓ ఎన్‌గుయన్ జియాప్‌కు విప్లవ జోహార్లు

**జపాన్,** ఫ్రెంచి, అమెరికా సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా జాతీయ విమోచన కొరకు వియత్నాం ప్రజలు సాగించిన పోరాటం సృజించిన వీరులలో ఒకడైన ఓ ఎన్‌గుయన్ జియాప్ 102 ఏళ్ళ వయసులో మరణించారు. ఆయనకు సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి విప్లవజోహార్లు తెలుపుతున్నది.

వియత్నాంలోని క్వాన్ బింగ్ రాష్ట్రంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో 1911లో జియాప్ జన్మించారు. 14ఏళ్ళకు స్కూలు విద్యార్ధిగా వియత్నాం జాతీయోద్యమంలో చేరారు. హనోయ్ విశ్వవిద్యాలయంలో చరిత్రలో డాక్టరేట్ పట్టా పొంది అధ్యాపకుడిగా చేరారు.

1938లో హోచిమిన్ స్థాపించిన ఇండో చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. ఫ్రెంచి వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. 1944లో జపాను దురాక్రమణకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని నిర్వహించారు.

ఫ్రాన్సుకు వ్యతిరేకంగా పోరాటాలలో దిన్ బియన్ పూ యుద్ధం, టెట్ దాడులు మైలురాళ్ళు. అతి చిన్నదేశం శక్తివంతమైన ఫ్రాన్సు సామ్రాజ్యవాదాన్ని కకావికలు చేసిన యుద్ధమది. ఈ గెరిల్లా యుద్ధ తంత్రాన్ని రచించి, నాయకత్వం వహించి నడిపింది జనరల్ జియాప్. దీని ఫలితంగా హనోయ్ నగరం 1945లో వియత్‌మిన్ ఆధీనమై, హోచిమిన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం ఏర్పాటును ప్రకటించాడు. జనరల్ జియాప్ ఆంతరంగిక శాఖామంత్రి అయ్యారు.

ఫ్రెంచి సామ్రాజ్యవాదులు వదలిన చెప్పుల్లో అమెరికా కాళ్ళు దూర్చింది. అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా వియత్నాం పోరాటం సాగించింది. "దీర్ఘకాల పోరాటంలో అమెరికా ఓడిపోతుంది." దాని "నైతిక ధృతి గడ్డిపోచ వంటిది" అని జియాప్ అన్నమాటలు నిజమయ్యాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో, కామ్రేడ్ హోచిమిన్ సారధ్యంలో, జనరల్ జియాప్ యుద్ధ తంత్రంతో వియత్నాం ప్రజలు ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దురాక్రమణ దారుడిని ఓడించారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఇండో చైనా నుండి తరిమికొట్టారు.

ఎలాంటి సైనిక శిక్షణా పొందని జియాప్ వియత్నాం ప్రజల జాతీయ విమోచనోద్యమంలో రాటుదేలి తిరుగులేని యుద్ధతంత్ర నిపుణుడిగా గుర్తింపు పొందారు. సామ్రాజ్యవాద దేశాలలోని పండితులు ఆయనను నెపోలియన్‌తో పోల్చారు.

కానీ జియాప్ మాత్రం "యావన్మంది ప్రజలనూ, సైన్యాన్ని రాజకీయంగా సమీకరించి నిలబెట్టిన కమ్యూనిస్టు పార్టీ, పోరాటానికి నాయకత్వం వహించటమే మా విజయ రహస్యమ"ని చెప్పారు.

దుర్భేద్యంగా భావించిన దిన్ బియన్ పూ సైనిక స్థావరాన్ని దుంప నాశనం చేసిన యుద్ధతంత్రానికీ, ఒకేసారి 40 రాష్ట్ర రాజధానులపై దాడిచేసి స్వాధీనం చేసుకున్న టెట్ దాడి తంత్రానికి, ఫ్రెంచి, అమెరికా సామ్రాజ్యవాదులను వియత్నాంలో ఓటమికి గురిచేయటానికీ, ప్రజలతో సన్నిహిత సంబంధం గల పార్టీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకున్న కార్యక్రమంలో ప్రజలను రాజకీయంగానూ, నిర్మాణపరంగానూ సంసిద్ధం చేయటమే మూలమని ఆయన రచనలన్నింటా పదే పదే స్పష్టం చేశారు.

అమెరికా సామ్రాజ్యవాదంపై వియత్నాం ప్రజలు కొట్టిన ప్రతి దెబ్బా భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమానికి ఉత్తేజాన్నిచ్చింది. వియత్నాం జాతీయ విమోచనా పోరాటం భారతదేశంలో ఒకతరం యువతపై చెరగని ముద్ర వేసింది. వారిని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లోకీ, సోషలిస్టు సమాజ నిర్మాణం కొరకు పోరాటాల్లోకీ దుమికేందుకు స్ఫూర్తినిచ్చింది.

ఆయన పేరులో 'ఓ' కు శక్తి అని అర్ధం. 'జియాప్'కు బలమైన కవచం అని అర్ధం. ఆయన సార్ధక నామధేయుడు.

**జనరల్ జియాప్‌కు అరుణారుణ జోహార్లు**

# అమెరికా పాలన మూసివేత కార్మికవర్గంపై దాడికి ముసుగు

**అమెరికాలో** అక్టోబరు 1 నుండి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమౌతుంది. అమెరికా ప్రజా ప్రతినిధుల సభైన కాంగ్రెసు ఆమోదించితే తప్ప పైసా కూడా ఖర్చుపెట్టరాదు. అమెరికా అప్పుచేయటానికి గల గడువు గత నెలలోనే దాటిపోయింది. ఇప్పుడు కాంగ్రెసు గనుక గరిష్టపరిమితిని పెంచకపోతే, దేశం చేసిన అప్పులు తీర్చలేని, ఖర్చులకు అప్పుచేయలేని స్థితిలో పడుతుంది.

అమెరికాలోని గుత్తపెట్టుబడిదారీ వర్గానికి ప్రతినిధులైన డెమొక్రాట్లు, రిపబ్లికన్ పార్టీలు రెండూ అక్టోబరు 1నాటికి కాంగ్రెసు ఆమోదించలేదన్న దానిని సాకుగా చూపి ఒక సంక్షోభ పరిస్థితిని కల్పించాయి. దీని చాటున ఆరోగ్యం తదితర సామాజిక భద్రతా సేవలలో పొదుపు చర్యలను రుద్దేందుకు పూనుకున్నాయి.

2010లోనూ, 2011లోనూ, తిరిగి 2012లోనూ కూడా ఇలాంటి సంక్షోభ స్థితినే కల్పించాయి. ధనికులపై పన్నులను తగ్గించాయి. విచక్షణాపూరిత వ్యయంలో (అంటే సామాజిక సేవల్లో) లక్ష కోట్ల డాలర్లు కోత పెట్టాయి. ఇదికాక ఏడాదికి 8500డాలర్లను, వచ్చే 8ఏళ్ళకూ లక్షకోట్ల డాలర్లను సిక్వెస్టర్ కార్యక్రమం పేరుతో కోతపెట్టాయి.

దీని పర్యవసానంగా 20లక్షల మంది వేతనాలను మూడేళ్ళపాటు స్థంభింపచేశారు. గత మార్చినెల నుండి సిక్వెస్టరు క్రింద వేతనాలు లేకుండా సెలవులిచ్చారు.

ఆ సంక్షోభాల సమయంలో రిపబ్లికన్లు దూకుడుగా వ్యవహరించారు. ఒబామా ప్రతిపాదించిన దానికంటే మరిన్ని కోతలు పెట్టాలని డిమాండ్లు చేశారు. సంక్షోభాన్ని పరిష్కరించటమన్న పేరుతో, రిపబ్లికన్లు అడిగిన కోతలన్నింటినీ డెమొక్రాట్లు ఆమోదించారు.

ప్రస్తుత మూసివేతలో కూడా యిదే నాటక మాడుతున్నారు. అమెరికా కేంద్రప్రభుత్వ ఉద్యోగులు 8లక్షలమందికి వేతనంలేని సెలవు యిచ్చారు. వేతనమిస్తామన్న హామీలేకుండానే మరెన్నో వేలమందిని పనిచేయమని ఆజ్ఞాపించారు. ప్రభుత్వ కార్యాలయాలు మూసివేసినందున, తక్కువ ఆదాయం వున్న 89 లక్షల మంది తల్లులకు, శిశువులకు అందిస్తున్న ఆహార సహాయం నిలిచిపోయింది. ఈ మూసివేత ప్రైవేటు రంగంపైన కూడా పడింది. పనిచేయాల్సిన ఆఫీసులు మూసివేసినందునా, చేసిన పనిని ప్రభుత్వ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించాల్సి వున్నందునా ప్రైవేటు కాంట్రాక్టర్లు తమ ఉద్యోగులను లే ఆఫ్ చేస్తున్నారు. లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ తన ఉద్యోగులలో 3వేల మందిని లే ఆఫ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. మూసివేత కొనసాగించి ఇంకా ఎక్కువమందిని లే ఆఫ్ చేయాల్సి వుంటుందని చెప్పింది. విమానతయారీ కంపెనీ బోయింగ్ కూడా ఇదే బాటను పట్టింది.

డెమొక్రాట్లకూ, రిపబ్లికన్లకు మధ్య వివాదానికి కారణమైన, మూసివేతకు దారితీసిన అంశం, రుణంపై గరిష్ట పరిమితిగా పైకి కనిపిస్తున్నది. రిపబ్లికన్లు రుణపరిమితిని శిఖండిలా వాడి ఒబామా కేర్ అని పిలుస్తున్న 'భరించగలిగిన ఆరోగ్యరక్షణ చట్టం 2010'కి, నిధుల కేటాయింపులు తగ్గించాలనీ దాని అమలు ఆలశ్యం చేయాలనీ చూస్తున్నారు. కాగా డెమొక్రాట్లు దీనిని అవసరమైన వారందరికీ ఆరోగ్యసేవలందించేదిగా ఉందని ప్రచారం చేస్తున్నారు.

వాస్తవానికిది తిరోగమన చర్య. ఆరోగ్యసేవల నిధులలో కోత పెడుతుంది. కోట్లాది కార్మికులు తమ జేబులలో నుండి ఆరోగ్య బీమాకు చెల్లించేట్లు చేస్తుంది. బీమా కంపెనీలు, ఆస్పత్రులకు లాభాలు సమకూర్చి పెడుతుంది. ఇంతేకాక స్థానిక పాలనా సంస్థలు తమ ఉద్యోగులకు కల్పిస్తున్న ఆరోగ్య పథకాలను రద్దుచేసి, ప్రైవేటు బీమాను ఉద్యోగులు కొనుక్కోవాల్సిన స్థితి కల్పిస్తుంది. ఐబియం, వాల్‌గ్రీన్స్ లాంటి కంపెనీలూ, డెట్రాయిటు వంటి మున్సిపాలిటీలు తమ ఉద్యోగులు ప్రైవేటు కంపెనీలలో ఆరోగ్యబీమా చేయించుకునేందుకు నగదు ఓచర్లు యివ్వటం మొదలయింది. బీమా కొరకు ఇలా ఓచర్లు యిచ్చే క్రమం మెడికేర్ పథకానికి (దారిద్రరేఖకు దిగువనున్న వారికి ప్రభుత్వ మందించే ఆరోగ్యసేవలు) క్రమంగా విస్తరిస్తారు. ఇది మొత్తం వైద్యరంగ ప్రైవేటీకరణకు దారితీస్తుంది.

2010లో ఒబామా ప్రవేశపెట్టిన ఆరోగ్యచట్టాన్ని రిపబ్లికన్లు సమర్ధించారు. వారడిగిన మార్పులన్నీ చేసి డెమొక్రాట్లు దానిని ఆమోదింపచేసుకున్నారు. వాస్తవానికి, మెడికేర్, సామాజిక సేవలలో కోత విధించటంలో వారిరువురికీ అంగీకారం వుంది. అలా మిగిలిన నిధులను అమెరికా గుత్తపెట్టుబడిదారులు దివాళా తీయకుండా అందిస్తున్న సహాయ నిధులకు (బెయిల్‌ఔట్) కొనసాగించటానికి వాడాలన్నది వారి ఆలోచన. అందువల్లనే 2010లో ఆమోదించిన చట్టం ఈ జనవరిలో అమలుచేయాల్సి వచ్చేసరికి దానిని వివాదంచేసి, కార్మికులపై దాడిని కప్పిపుచ్చుతున్నారు.

అక్టోబరు 2న సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒబామా "అనవసర" సామాజిక వ్యయాన్ని తగ్గించటాన్ని కొనసాగించవలసిన అవసరముందని చెప్పాడు. "దీర్ఘకాల ఉచిత వ్యయంలో" కోతలను చర్చించటానికి తాను సిద్ధంగా వున్నానని ప్రకటించాడు. 2010 ఆరోగ్యచట్టంలో రిపబ్లికన్లు కోరిన మార్పులకు అంగీకరించగలనని కూడా సూచనప్రాయంగా తెలిపాడు. వ్యక్తిగత ఆదాయపుపన్ను రేటును పెంచరాదన్న రిపబ్లికన్ల డిమాండును కూడా ఆమోదించగలనని చెప్పాడు. 16వతేదీ నాటికి ఒక రాజీ కుదిరే సూచనలున్నాయి.

అంటే ప్రస్తుత ప్రభుత్వ మూసివేతతో సంక్షోభాన్ని కృత్రిమంగా సృష్టించారు. తద్వారా దానిని పరిష్కరించటమన్నపేరిట, అమెరికా ప్రజలపై భారాలు మోపే విధానాలను అమలు జరిపేందుకు అనువైన రాజకీయ పరిస్థితిని కల్పించారు.

ప్రభుత్వ గృహ, పట్టణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఇలా అన్నాడు. "2011లో ఏం జరిగిందో నాకు గుర్తుంది. రిపబ్లికన్ ప్రతినిధులలో అనేకమంది వెనక్కు తగ్గినప్పటికీ, అనేక (సామాజిక) పథకాలకు కోతపెట్టింది ఒబామా, డెమొక్రాట్లే".

ఇది అమెరికా ప్రజలలో పెరుగుతున్న ఆగ్రహాన్ని తెలుపుతున్నది. అనేక ఉద్యోగ సంఘాలు కలసి వందలాదిమందితో అధ్యక్షభవనం ముందు అక్టోబరు 4న నిరసన ప్రదర్శన చేశారు.

అందులో పాల్గొన్న మేరీలాండ్ విశ్వవిద్యాలయ విద్యార్థిని రూలా పత్రికలతో ఇలాచెప్పింది. "ఉపాధ్యాయిని కావాలని కాలేజికి వెళుతున్నాను. ఉపాధ్యాయునికి మంచి ఉద్యోగ భద్రత వుందనుకున్నాను. ఇప్పుడు ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోవటంచూసి ఆందోళన పడుతున్నాను. కొన్నిచోట్ల బడులే మూసి వేశారు".

ఈ అశాంతి, ఆగ్రహమూ ప్రజానిరసనోద్యమంగా మారేందుకు ఎక్కువ సమయం పట్టదు. **13-10-13** ✡

## విజయ సాధనలో... (3వ పేజీ తరువాయి)

యుద్ధ శక్తులను పెంపొందించటానికి గాను, ప్రతి దశలోను, యుద్ధగమనంలో విప్లవ కర్తవ్యాలను గూర్చి అంచలంచెలుగా గుర్తించేట్లుగా మా ప్రజలకు మా పార్టీ నాయకత్వం వహించి నడిపింది.

ఫ్రెంచి వలసాధిపతులకు వ్యతిరేకంగా ప్రతిఘటనా యుద్ధంలో, మా పార్టీ "పోరాటాన్ని, జాతీయ పునర్నిర్మాణాన్ని జోడించి సాగించే విధానాన్ని నిర్దేశించింది. కరువును, నిరక్షరాస్యతను, విదేశీ దురాక్రమణను ఏకకాలంలో" ఎదుర్కొనవలసిందిగా అధ్యక్షుడు హోచిమిన్ ఇచ్చిన ఆదేశాన్ని తద్వారా ఆచరణలో బెట్టింది ప్రతిఘటనాయుద్ధంలో మా ప్రజల బలాన్ని పెంపొందించుకొనటానికి, ప్రత్యేకించి మా బలగాలలో అత్యధిక సంఖ్యాకులయిన రైతాంగం యొక్క బలాన్ని పెంపొందించటానికి, మేము ప్రజాతంత్ర సంస్కరణలు చేపట్టాం. భూమి కౌలును క్రమపద్ధతిలో తగ్గించటం కోసం, భూ సంస్కరణకోసం జనసామాన్యాన్ని సమీకరించటానికి ముందు, మా పార్టీ యొక్క వ్యవసాయ విధానాన్ని అంచలంచెలుగా సాధించాం.

అమెరికన్ సామ్రాజ్యవాదులు యుద్ధాన్ని మా దేశం ఉత్తరభాగానికి విస్తరించినప్పుడు మా పార్టీ సోషలిస్టు నిర్మాణాన్ని సాగిస్తూనే ప్రతిఘటనా యుద్ధం సాగించాలనే విధానాన్ని నిర్దేశించింది. మా ఆర్థిక, సైనికశక్తి వుధృతం చేయటానికి, ప్రజల జీవన పరిస్థితులను స్థిరపరచటానికి గాను, మా ఆర్థిక వ్యవస్థను యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దాం. అమెరికా వినాశకర యుద్ధాన్ని వమ్ముచేయటానికి, గొప్పదైన దక్షిణప్రాంత యుద్ధశ్రేణి పట్ల వెనుకతట్టు స్థావరంగా మా కర్తవ్యాలను నిర్వర్తించటానికి, అన్ని రంగాలలోనూ, మేము సోషలిస్టు పాలనయొక్క ఆధికత్యతను వుపయోగపెట్టాం. ఇది మరొక, సవ్యమైన, సృజనాత్మకమైన విధానం.

దక్షిణ వియత్నాంలోని విముక్త ప్రాంతాలలో, జాతీయ విమోచన సంఘటన, తాత్కాలిక విప్లవ ప్రభుత్వాల నాయకత్వాన మా ప్రజలు వీరోచితంగా పోరాడారు. విప్లవ విజయాలను నిలబెట్టుకొని, కాపాడుకొన్నారు. నూతన జీవితాన్ని నిర్మిస్తూనే శత్రువుపై పోరాడారు. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నింటిలోనూ, ప్రజలు తమ భవితవ్యానికి తామే కర్తలయ్యే హక్కుకు హామీ కల్పించింది.

ఈ చర్యల వల్ల దృఢమైన రాజకీయ, ఆర్థిక పునాది ఏర్పడింది. మా ప్రజల బలాన్ని పటిష్టం చేయటం, కార్మిక-కర్షక మైత్రిని పటిష్టతరమొనరించటం (జాతీయ ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గానికి, కష్టజీవులైన రైతులకు మధ్య, సోషలిస్టు విప్లవంలో కార్మికవర్గానికి, సహకార రైతులకు మధ్య మైత్రి), ప్రజల అధికారాన్ని పటిష్టమొనరించటం, జాతీయ ఐక్యసంఘటనను దృఢతరమొనరించటం, మా ప్రజాసాయుధ బలగాల ప్రతిఘటనా సామర్థ్యాన్ని పెంపొందించటం, మా పార్టీ నాయకత్వాన్ని పటిష్టమొనరించటం ఆ పునాదిపైనే జరుగుతోంది.

యుద్ధం సాగించే క్రమంలోనే, విప్లవ కర్తవ్యాలను క్రమక్రమంగా సాధించటం కూడా, జనసామాన్యం యొక్క రాజకీయ – నైతిక బలాన్ని పూర్తిగా పెంపొందించి, వుపయోగపెట్టుకొనటానికి ఉపకరించే ప్రాథమిక చర్యయే. అందువల్ల వియత్నాం ప్రజల విప్లవ యోధత్వం రంగంలో కొస్తుంది. ప్రజలే కర్తలైన మా నూతన సాంఘిక వ్యవస్థలో నూతన వుత్పత్తి పద్ధతిలో దానిని మిళితం చేస్తుంది.

**3. ప్రజాసాయుధ బలగాలలోను, ఇతర ప్రజా సంస్థలన్నింటిలోను, సాయుధ పోరాటంలోను, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పోరాటంలోను పై నుండి క్రిందివరకూ పార్టీ నాయకత్వం యొక్క నిర్మాణాన్ని జరిపి, సంఘటితపరచటం. యుద్ధంలో సర్వతోముఖమైన, కేంద్రీకృతమైన, సమైక్యమైన పార్టీ నాయకత్వాన్నివ్వటం జరుగుతోంది.**

మా పార్టీ, కేంద్ర కమిటీ స్థాయి నుండి దిగువన వివిధ పోరాటరంగాల, రాష్ట్రాల, జిల్లాల, గ్రామాల స్థాయివరకు తన నాయకత్వాన్ని ఏర్పాటుచేసుకొని స్థిరపరచుకొంది. రెగ్యులర్ సైన్యంలో, పార్టీ నిర్మాణం కేంద్ర సైనికకమిటీ నుండి దిగువన కంపెనీ సెల్సు వరకు సాగుతుంది. అదే సమయంలో, మా పార్టీ సైన్యంలోని పార్టీ నిర్మాణానికి, ఆయా ప్రాంతాలలోని పార్టీ నిర్మాణానికి మధ్య సంబంధాన్ని కూడా నిర్వచించింది. ఆ విధంగా, అన్ని బలగాలపైన, అన్ని రంగాలలోను, ప్రతి ప్రాంతంలోను, మొత్తం దేశమంతటిలోనూ పార్టీ కేంద్రీకృత, సమైక్య నాయకత్వం లభిస్తోంది.

గ్రామీణ ప్రాంతంలో, ప్రజాయుద్ధానికి గ్రామమే ప్రాథమిక యూనిట్. పార్టీ నిర్మాణమూ, దాని కమిటీ దాని సిబ్బందిగా వుంటాయి. ఫ్రెంచి వలసాధిపతులకు వ్యతిరేకంగా సాగించిన ప్రతిఘటనాయుద్ధంలో వలెనే, అమెరికన్ దురాక్రమణకు వ్యతిరేకంగా సాగించబడుతున్న ప్రస్తుత పోరాటంలోనూ ప్రతి గ్రామాన్ని ఒక కోటగా, ప్రతి పార్టీ సెల్లును ప్రజాయుద్ధపు సిబ్బందిగా రూపొందించటంలో మేము విజయవంతమైనాం. గ్రామంలో పార్టీ నిర్మాణం ఒకవైపున, రక్షణ నిర్మాణాలు చేయటంలో, గెరిల్లా యుద్ధాన్ని రాజకీయ పోరాటాన్ని ఉధృతం చేయటంలో, పౌరులను సంరక్షించటంలో, విప్లవాధికారాన్ని సంపాదించుకొని నిలబెట్టుకొనటంలో, స్థానిక సైనిక కార్యకలాపాలను రెగ్యులర్ సైన్యపు కార్యకలాపాలతో సమన్వయపరచటాన్ని గ్రామంలోని పార్టీ నిర్మాణం సాధిస్తుంది. మరోవైపున, వుత్పత్తిని పెంపొందించటంలో, నూతన జీవితాన్ని నిర్మించటంలో, వెనుకతట్టు స్థావరాలను పటిష్టమొనరించటంలో, యుద్ధరంగంలోని అగ్రశ్రేణికి సైనికులను, భౌతిక వనరులను, సరఫరాచేయటంలో ప్రజానీకానికి పార్టీ నాయకత్వం వహిస్తుంది. పార్టీ రాజకీయపంథా, కేంద్రకమిటీ నిర్దేశించిన అన్ని నిర్దిష్టచర్యలూ గ్రామాల్లో ఆచరణకు తేబడతాయి. పార్టీయొక్క ప్రాథమిక నిర్మాణం యొక్క నిత్యనూతనమైన, స్థిరమైన నాయకత్వం లేకపోతే, దురాక్రమణకు వ్యతిరేకంగా శక్తివంతమైన, నికరమైన ప్రతిఘటనే ఉండేదికాదు.

ప్రజాయుద్ధానికి విజయం సాధించటంకోసం, అన్ని స్థాయిలలోనూ పార్టీ నాయకత్వం సర్వతోముఖమైనదిగా వుండాలి.

అది అన్ని రంగాలకు వర్తించాలి. ప్రధానంగా సాయుధ పోరాటానికీ, రాజకీయ పోరాటానికీ, శత్రు సైనికుల మధ్య ఆందోళనోద్యమానికీ, మా సైనిక, రాజకీయ, ఆర్థిక బలగాలను నిర్మించటంలో, దేశానికి అధినేతలుగా వుండేందుకు ప్రజలకు గల హక్కు సుస్థిరపరచటంలోనూ దాన్ని వర్తింపజేయాలి. దీర్ఘకాలిక యుద్ధాలు మా పార్టీకి గల నిర్మాణశక్తిని పెంపొందించాయి. అన్ని స్థాయిలలోనూ పార్టీ నిర్మాణం, ఈ రంగంలో చాలా అనుభవం గడించింది. ఆ విధంగా పోరాటానికి సంబంధించిన బహుళ సమస్యల విషయంలో, జాతీయ నిర్మాణంలో, నిర్దిష్టమైన మార్గదర్శకత్వాన్నిస్తోంది. ప్రజాయుద్ధంలో సర్వతోముఖమైన, కేంద్రీకృత, సమైక్య నాయకత్వాన్ని సాధించింది. ఇదంతా, ప్రజాయుద్ధానికి ప్రతి ప్రాంతంలోనూ అత్యధిక శక్తి, సామర్థ్యాలను కల్పించింది.

ఆగస్టు విప్లవం నాటి నుండి మా పార్టీ అధికారం చేపట్టింది. పార్టీ నాయకత్వాన రాజకీయాధికారం వుండటం, విప్లవ యుద్ధాన్ని నిర్వహించటంలో పార్టీకి, ప్రజలకు అత్యంత ప్రధానమైన సాధనంగా వుంటుంది. మా పార్టీ నిరంతరాయంగా, ప్రజాసాయుధ బలగాలపైన, ప్రజల అధికారంపైన, జాతీయ ఐక్యసంఘటనపైన, అన్ని స్థాయిలలోనూ, తన నాయకత్వాన్ని పటిష్టమొనరించుకొంది. వాటి పాత్రను వాటి కార్యాచరణను పూర్తిగా వుపయోగపెట్టుకొంది. ఆ విధంగా చేయటం ద్వారానే, నిర్మాణరంగంలో యావన్మంది ప్రజల బలగాలను మొత్తంగా సమీకరించటానికి సాధ్యమవుతుంది. దురాక్రమణదారునికి వ్యతిరేకంగా పోరాడటానికి మొత్తం జాతిని సమీకరించటం సాధ్యమవుతుంది.

కార్యకర్తలు, సభ్యులు పార్టీ రాజకీయ పంథాను, పార్టీ నిర్దేశించిన నిర్దిష్ట చర్యలను ప్రచారం చేయాలి. వాటిని అవగాహన చేసుకొని, ఆచరణకు తెచ్చేందుకు గాను జన సామాన్యానికి తగిన విజ్ఞానం కలుగజేసి, సంఘటితపరచాలి. అందువల్ల, వారికి శిక్షణ యివ్వటం, వారిని అభివృద్ధిపరచటం, యుద్ధసమయంలో ఏకైక నాయకత్వాన్ని కల్పించటంలో కీలకసమస్య. నాయకత్వాన్ని ఏర్పరచటంలో మౌలికమైన కర్తవ్యం అదే. యుద్ధ సమయంలో, నాయకత్వపు అవసరాలు తీర్చగలిగే సామర్థ్యం గలిగిన అర్హులైన కార్యకర్తలు తగినంతమంది వుండటం మాకు నిరంతరమూ అవసరం. అన్ని తావులలోనూ, తన నాయకత్వాన్ని పటిష్టమొనరించుకొనటం కోసం, అన్ని రంగాలలోనూ జనసామాన్యానికి మార్గదర్శకత్వం వహించటం కోసం మేము పార్టీ సభ్యత్వాన్ని చురుకుగా విస్తృతపరచవలసినయుంది.

పార్టీ కార్యకర్తలకు, సభ్యులకు శిక్షణ గరపి అభివృద్ధి పరచటంలో, ప్రధానమైన కర్తవ్యం వారి వర్గ చైతన్య స్థాయిని, అగ్రగామి దళ స్వభావాన్ని పెంపొందించటం. మొట్టమొదటగా, వారు కార్మికవర్గ వైఖరికి దృఢంగా కట్టుబడి వుండాలి. మార్క్సిజం-లెనినిజాన్ని, ప్రగాఢమైన దేశభక్తిని, సమగ్రమైన విప్లవోత్తేజాన్ని, పోరాడటానికి సర్వసన్నద్ధతను, జాతీయ విమోచనకోసం, కమ్యూనిస్టు ఆదర్శం కోసం ఆత్మార్పణ జేయటానికి, అవసరమైన ధోరణిని జీర్ణించుకోవాలి. వర్గపోరాటంలోను, జాతీయ విమోచనా పోరాటంలోనూ వారు నిరంతరమూ అగ్రశ్రేణిలో వుండాలి.

గత కొన్ని దశాబ్దాలుగా పోరాటం ఎంత భీషణంగా సాగినప్పటికీ పార్టీ కార్యకర్తలు, సభ్యులు, అన్ని పరిస్థితులలోనూ వీరోచితంగా పోరాడారు. ప్రజల నుండి ప్రగాఢమైన ప్రేమను, గొప్ప విశ్వాసాన్ని చూరగొన్నారు. మాతృదేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం, సోషలిజం కోసం, పార్టీ యొక్క – ప్రజల యొక్క విప్లవ లక్ష్యంకోసం, అనేకమంది తమ ప్రాణాలనే అర్పించారు. అది మా పార్టీకి గొప్ప గౌరవం, గర్వకారణం.

\ \ \

తమ అనుభవం యొక్క మార్గదర్శకత్వం క్రింద, హృద్యమైన విప్లవ భావాలతో వుత్తేజితులైన మా ప్రజలకు పార్టీపై పరిపూర్ణ విశ్వాసం వుంది. మా పార్టీ అన్నా, మా పార్టీ మహానాయకుడగు అధ్యక్షుడు హోచిమిన్ అన్నా వారికి ఎంతో గర్వకారణం. పార్టీ జన సామాన్యంతో సన్నిహిత సంబంధం కలిగివుంది. జన సామాన్యం పార్టీ నాయకత్వాన సమీకృతమై వున్నారు. మా పార్టీ మాత్రమే, వర్గ ప్రయోజనాలను మొత్తం వియత్నాం జాతి ప్రయోజనాలతో విచక్షణపూర్వకంగా జోడించగలదు. వర్గం అనే అంశాన్ని, జాతి అనే అంశంతో, నిజమైన దేశభక్తిని, కార్మికవర్గ అంతర్జాతీయతతోను జోడించగలదు. మహత్తరమైన మా సైనిక సాంప్రదాయాలను కొనసాగించగలదు. మా ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బాటవేయగలదు. మా పార్టీ మాత్రమే, మా జాతి యొక్క శక్తులను అత్యంత గరిష్టస్థాయిలో సమీకరించగలదు. సామ్రాజ్యవాద దురాక్రమణదాడులను ఓడించటంలో ప్రపంచ విప్లవం నుండి గొప్ప అండదండలు పొందగలదు. మా పార్టీ నాయకత్వాన్ని నిరంతరాయంగా పటిష్టమొనరించడమే, ప్రజల తిరుగుబాటు, ప్రజా యుద్ధంగా విజయం పొందటానికి హామీగా వుండే అత్యంత ప్రధాన షరతు. ✡


Read ! Subscribe!!




Organ of Central Committee of CPI (ML)

# దక్షిణాఫ్రికా: తమ జీవితాలలో మౌలిక మార్పు కొరకు మార్గానికై వెదుకులాడుతున్న ప్రజానీకం

**జాతి** వివక్షకు, వలసవాదానికి వ్యతిరేకంగా స్వేచ్ఛాయుత జీవనానికై దక్షిణాఫ్రికా ప్రజానీకం సాయుధంగానూ శాంతియుతంగానూ ఒక దీర్ఘకాల యుద్ధాన్ని సాగించారు. ఈ పోరాటాలను నడిపిన కమ్యూనిస్టులు, జాతీయశక్తులు ఘోరమైన నిర్బంధాన్ని చవిచూశాయి. దక్షిణాఫ్రికా ప్రముఖ జాతీయ నాయకుడు నెల్సన్ మండేలా, తన జీవితంలోని అత్యధిక కాలాన్ని జైలులోనే గడిపారు. చారిత్రకంగా ప్రపంచంలో వలస వాదానికి కాలం చెల్లిపోయిందని బ్రిటిష్ వలసవాదులకు స్పష్టమైనప్పటికీ, సాధ్యమైనంతకాలం వారు తమపాలనను కొనసాగించే ప్రయత్నం చేశారు. ప్రజలపై ఒకవైపున అన్ని విధాలా అణచివేతను ప్రయోగిస్తూనే, మరోవైపున దక్షిణాఫ్రికాలో తమ దోపిడీని కొనసాగించటానికి వీలైన షరతులకు ఒప్పించుకునేందుకు జాతీయోద్యమ నాయకత్వంతో సుదీర్ఘ చర్చల ప్రక్రియను సాగించారు. ఈ మొత్తం కసరత్తు ఫలితంగా తాము ఎంచుకున్న విధంగా అధికారమార్పిడి జరిగింది. విప్లవ కర్తవ్యాలు సంపూర్ణం కాకుంటే వలసవాద దేశాల భవిష్యత్తు ఎలా వుంటుందనే దానికి, జాతి వివక్షానంతర దక్షిణాఫ్రికాదేశం ఒక ప్రామాణిక నమూనాగా నిలుస్తుంది.

అధికారమార్పిడి తర్వాత దక్షిణాఫ్రికా దేశాన్ని – కొసాట్యు (కాంగ్రెస్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా ట్రేడ్‌యూనియన్స్), ఏఎన్‌సి(ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్), మరియు ఏఎన్‌సి నాయకత్వంలో నడుపబడుతున్న దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీల – మూడింటి కూటమి పాలన చేస్తోంది. ఈ పాలన ప్రజల జీవితాలలో ఎలాంటి మౌలిక మార్పులనూ కలిగించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాదులు వారి గుప్పెటలోనే వుంచుకోవటాన్ని ఈ పాలకులు అనుమతించారు. సామ్రాజ్యవాద అనుకూల, నయా ఉదారవాద విధానాల పేరుతో సామ్రాజ్యవాదులు మరియు ఆఫ్రికన్ దళారీ బూర్జువాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తమ పట్టును మరింత బలీయం చేసుకోవటానికి ఈ నూతన పాలకులు కావలసిన చర్యలన్నీ చేపట్టారు.

నూతన పాలకులు విప్లవ భూసంస్కరణలను చేపట్టలేదు. మార్కెట్టు విలువ ప్రకారం శ్వేతజాతి భూయజమానుల నుండి భూమిని కొనుగోలుచేసే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈనాటికీ 7శాతం భూమిని మాత్రమే ప్రభుత్వం పునఃపంపిణీ చేసింది. దీనితోబాటుగా, దేశంలోకి వివిధ దేశాల బహుళజాతి సంస్థలను, కార్పొరేటు కంపెనీలను అనుమతించటంతో వారు పెద్ద ఎత్తున పేద నల్లజాతీయుల భూములను గుంజుకుని వారిని నిర్వాసితులుగా, నిరాశ్రయులుగా చేస్తున్నారు. ఈ పరిస్థితి ఆఫ్రికా గ్రామీణ ప్రజానీకాన్ని దుర్భర పరిస్థితులకు గురిచేసి, తీవ్ర జీవన అభద్రతను కలుగజేస్తోంది. దక్షిణాఫ్రికా గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములకు, గ్రామీణ నల్లజాతి ప్రజానీకానికి నడుమ ఘర్షణలు, ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

పారిశ్రామికరంగంలో, దక్షిణాఫ్రికా సహజ వనరులను, మానవవనరులనుస్వేచ్ఛగా దోచుకునేందుకు బహుళజాతి సంస్థలకు, దేశీయ కార్పొరేటు సంస్థలకు అన్ని అవకాశాలను కల్పించారు. నూతన పాలకులు దక్షిణాఫ్రికా ట్రేడు యూనియన్ నాయకులు కొద్దిమందిని ధనికులు అయ్యేందుకు ప్రోత్సహించారు. ప్రజలను ప్రలోభపరిచే, ప్రాచుర్యం పొందిన 'నల్లజాతీయుల ఆర్థిక సాధికారత'(బిఇఇ) నినాదం మాటున వారందరినీ పెట్టుబడిదారీ వర్గాల వెనుక చేర్చుకున్నారు. పాలక కూటమిలో ఒక భాగస్వామిగా వున్న నేషనల్ యూనియన్ ఆఫ్ మైనర్స్ (ఎన్‌యుఎమ్) ద్వారా మైన్ వర్కర్స్ ఇన్‌వెస్టుమెంట్ కంపెనీ (ఎంఐసి)ని ఏర్పరిచేందుకు, విదేశీ గుత్తకంపెనీలతో కలసి పారిశ్రామిక సంస్థలను స్థాపించటానికి, వ్యాపారాలను నిర్వహించటానికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం అనుమతించింది.

జోహెన్స్‌బర్గ్ విమానాశ్రయ సమీపంలో ఎన్‌యుఎం ఒక 'ఎంపరర్స్ ప్యాలస్ క్యాసినో'ను నిర్వహిస్తోంది. ఇదొక జూదగృహం. ఎన్‌యుఎం మరియు సౌత్‌ఆఫ్రికా క్లాతింగ్ & టెక్స్టైల్ వర్కర్స్ యూనియన్(యస్ఏసిటిడబ్ల్యుయు)ల ఆధ్వర్యంలో దక్షిణాఫ్రికాలో అనేక కంపెనీలు వెలిశాయి. ఎంఐసి యొక్క అన్ని ఆర్థిక విభాగాల్లో ఎన్‌యుఎం పెట్టుబడులను అప్పుగా ఇస్తోంది. టెలికం రంగంలో అతిపెద్ద పరిశ్రమైన ఎంటిఎన్ మరియు వొడాకామ్‌లతో ఇది భారీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఎంఐసి మరియు యస్ఏసిటిడబ్ల్యుయుల సంయుక్త పెట్టుబడుల బృందం హెచ్ఐసి అనే పెద్ద బీమారంగ కంపెనీని కొనివేసింది. ఈ హెచ్ఐసి 14దేశాలలో తన కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ విధంగా, దక్షిణాఫ్రికాలో ఎంఐసి బాగా విజయవంతమైన పెట్టుబడుల కంపెనీగా అవతరించింది. గనికార్మికుల పిల్లల సంక్షేమంకోసమంటూ ఎంఐసి వెచ్చించే నిధులు అతికొద్ది మంది కార్మికులకు మాత్రమే అందుతున్నాయి. ఈ విధంగా ఒకనాడు సమరశీల ట్రేడ్ యూనియన్‌గా కొనసాగిన ఎన్‌యుఎంను కార్పొరేట్లకు సన్నిహితమైన ప్రభుత్వేతర సంస్థగా పరిణామం చెందించిన ఎంఐసి యొక్క ప్రధాన కేంద్రీకరణ అంతా ఈనాడు పెట్టుబడులు, లాభాలు, స్టాక్‌మార్కెట్ల జూదం చుట్టూతా ఎన్‌యుఎంను తిప్పుడంగా వుంది.

## పరిశ్రమల చేతిలో పనిముట్లుగా ట్రేడ్‌యూనియన్లు

ట్రేడు యూనియన్లను పెట్టుబడుల సంస్థలుగా, కొందరు ట్రేడు యూనియను నాయకులను పారిశ్రామిక అధికార యంత్రాంగ అధిపతులుగా, ప్రధాన పరిపాలనాధికారులుగా మలచిన వ్యవస్థలో చాలా సహజంగా కంపెనీల పెట్టుబడులను, లాభాలను, ఆ యాజమాన్యలను రక్షించి, అభివృద్ధి చెందించటమే ట్రేడు యూనియన్ల పరమావధిగా మారుతుంది. మెరుగైన యాజమాన్యం అంటే కూడా అంతే సహజంగా కార్మికులు క్రమశిక్షణ తప్పకుండా వారిచే అధికశ్రమ చేయిస్తూ, వారి డిమాండ్లు, పోరాటాలపట్ల నిక్కచ్చిగా వ్యవహరించగలిగేదే అవుతుంది.

వారి స్వంతవైన ట్రేడు యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహింపబడే కంపెనీలకు కొన్ని అదనపు ఉపయోగాలున్నాయి. కార్మికుల నుండి సభ్యత్వాల చెల్లింపు, చందాల రూపంలో నిరంతరాయంగా సమకూరే నిధులు, వాటాల రూపంలో కార్మికుల నుండి అందే మొత్తాలు – ఈ యాజమాన్యం వద్దే పోగుపడ్తాయి. ఇతర యాజమాన్యాల నిర్వహణలోని పరిశ్రమలతో పోల్చినపుడు, ఈ పరిశ్రమలలోని ట్రేడు యూనియన్ నాయకులు కార్మికులపై పట్టు, ప్రభావం కలిగివుండి, కంపెనీ యాజమాన్య ప్రయోజనాలకు భంగం కలగకుండా, కార్మికులు 'క్రమశిక్షణ' తప్పకుండా చూస్తారు. కార్మికులకు వ్యతిరేకంగా వారు రెండంచుల పదునైన కత్తిలా వ్యవహరిస్తారు. వివిధ దేశాలలో పెట్టుబడిదారులు, వారి ప్రాపకంలో యూనియన్లను ఏర్పరచటం, ప్రలోభపరచటం, ట్రేడు యూనియను నాయకత్వాలను కొనుగోలు చేయటం, తదితర పద్ధతుల్లో లోపల నుంచే ట్రేడు యూనియను ఉద్యమాన్ని ధ్వంసం చేయటానికి ప్రయోగిస్తారు. ట్రేడు యూనియన్ నాయకులలో ట్రేడు యూనియన్ నిరంకుశత్వం లేక ఉద్యోగిస్వామ్యాలను వీరి విధానాలు పెంచి పోషిస్తాయి. ఈ తరహా నాయకత్వాలు ఉద్దేశ్యపూర్వకంగా ఆర్థికవాదాన్ని, కంపెనీ యజమానులపట్ల విధేయతను, లొంగుబాటు విధానాలను ప్రోత్సహిస్తాయి. 'కార్మికుల సంక్షేమమే కంపెనీ యజమానుల ప్రధాన విధి' వంటి పనికిమాలిన నినాదాలను ప్రచారంలో పెట్టటం ద్వారా ఈ నాయకులు, యాజమాన్యాల ప్రయోజనాలను కాపాడుతూ కార్మికులలో భ్రమలను పెంచుతారు. కార్మికవర్గం ఈ విధంగా ఒక వర్గంగా తన వర్గస్పృహను, పోరాట లక్షణాలను కోల్పోయి భావజాలపరంగా నిరాయుధం చేయబడుతుంది. ఈ ట్రేడు యూనియన్ల నాయకులు అడపా దడపా లేదా కొన్ని సందర్భాలలో పరిస్థితుల వత్తిడి ఫలితంగానో, లేదా రొటీన్‌గానో కొన్ని నిరసన కార్యక్రమాలకు, సమ్మెలకు పిలుపునిస్తారు. కొన్ని సందర్భాల్లో, యాజమాన్యంతో తీవ్ర సంఘర్షణ పడుతున్నట్లుగా నాటకాలాడతారు. మరికొన్నిసార్లు చావోరేవో తేల్చుకోవాలనేనినాదాలిస్తారు. తెగించినట్లుగా, సమరశీలంగా కనిపించేట్లుగా, కొన్నిసార్లు హింసాత్మక చర్యలకు కూడా పాల్పడతారు. కార్మికులలోని అసంతృప్తి బ్రద్దలు కాకుండా బయటకు విడుదల చేయటం; యాజమాన్యాల అణచివేతకు వీలుగా మిలిటెంటు కార్మికులను వారికి వెల్లడిచేయటం; తమ రంగు వెలిసి పోకుండా కాపాడుకోవటం; పోరాటం అవమానకర ముగింపుకు చేరుకోవటానికి తగిన పరిస్థితులను సృష్టించటమనే ఒక పెద్ద పథకంలో భాగంగా పై చర్యలన్నీ చేపడతారు. ఈ తరహా ట్రేడు యూనియను నాయకులతో యాజమాన్యాలు సత్సంబంధాలను, తెరవెనుక సంబంధాలను కొనసాగిస్తాయని, వారు తమకు అందచేస్తున్న సేవలకుగానూ భారీ నగదును, నజరాలను చెల్లిస్తాయనే విషయం మనకు తెలిసిందే.

దక్షిణాఫ్రికా దేశంలోని ఎన్‌యుఎమ్ మరియు 'కొసాట్యు' మొదలైన సంస్థలను గమనిస్తే దోపిడీ వర్గాలు తమ రాజకీయార్థిక ప్రయోజనాలకోసం ఉద్దేశపూరితంగా ఈ తరహా చర్యలను మరింతగా పెంచుతారని అర్థమౌతుంది. ఈ తరహాలో, దోపిడీవర్గాలు బాహాటంగానూ, టోకుగానూ ఇంకా మొరటుగానూ ట్రేడు యూనియను నాయకత్వాలను సామ్రాజ్యవాద ఆధిపత్యంలోని పెట్టుబడిదారీ వ్యవస్థకనుగుణంగా సంపూర్ణంగా మలచటం జరుగుతోంది. వేళ్ళ మీద లెక్కించగలిగినంత మంది ట్రేడ్‌యూనియన్ నాయకులకు మాత్రమే పెట్టుబడిదారుల హోదానివ్వటం ద్వారా దోపిడీ వర్గాలు అసంఖ్యాక కార్మిక ప్రజానీకాన్ని మోసగించటానికి, మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలను పరిరక్షించటానికి పూనుకున్నాయి.

ఎన్‌యుఎం మరియు 'కొసాట్యు'ల నాయకత్వాలు తమ కార్మిక వ్యతిరేక విధానాలతో ఇప్పటికే 'ప్రసిద్ధి' కెక్కాయి. మారికానా ప్లాటినం గని కార్మికుల పోరాటాన్ని క్రూరంగా అణచివేయటంలో ఎన్‌యుఎం మరియు 'కొసాట్యు' నాయకత్వాల నీచమైన పాత్ర బాగా వెల్లడైంది. ఈ ఘటన అనంతరం ఈ నాయకత్వాల ప్రతిష్ట అధఃపాతాళానికి పతనమైంది. విసిగిపోయిన కార్మికులు ఈ యూనియన్ల నుండి పెద్దసంఖ్యలో బయట పడుతున్నారు. ఈవిధంగా వీరి విధానాలను వ్యతిరేకిస్తున్న, విసుగుచెంది బయటకువస్తున్న కార్మికులు తమ హక్కుల, ప్రయోజనాల పరిరక్షణకు నూతన సంస్థల ఏర్పాటుకు, నూతన తరహా పోరాటాల కోసం వెతుకులాడుతున్నారు.

దోపిడీపీడనలకు, అణచివేతకు గురయ్యే ప్రజానీకం, తమ జీవితానుభవాలపై వాస్తవాలపై ఆధారపడి నేర్చుకోవటం సహజం, న్యాయం, అనివార్యం కూడా! తమ ప్రయోజనాలపైఆధారపడి దోపిడీవర్గాలు ప్రజానాయకత్వ విభాగాలను కొనుగోలు చేసే సరికొత్త పద్ధతులను కనుగొని ప్రయోగిస్తున్న విధంగానే, దక్షిణాఫ్రికాలోని చైతన్యయుతులైన కార్మికులు, అణచివేతకు గురవుతున్న ప్రజానీకం కూడా దోపిడీవర్గాల కుటిల విధానాలను ఓడించేందుకు అనువైన విధానాలను అభివృద్ధి చేసుకోవటానికి నిరంతరాయంగా కృషి సాగిస్తారు. సరైన విప్లవ పంథాలో ఫ్యూడలిజం, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా, అన్ని రూపాలలోని దోపిడీ అణచివేతల నుండి విముక్తి లభించే దక్షిణాఫ్రికా కోసం వీరంతా కార్మికవర్గ నాయకత్వాన ఐక్యంగా సమీకృతులవటం తథ్యం. ✡

# పెన్షను నిధులు: మరోసారి కార్మికవర్గాన్ని వంచన చేసిన పాలకులు, పాలకవర్గాలు

**కాంగ్రెస్‌పార్టీ** ఆధ్వర్యంలోని యుపిఏ-2 ప్రభుత్వం, తన ప్రధాన ప్రత్యర్థి అయిన బిజెపి మద్దతుతో – సిపిఐ, సిపిఎం, డిఎంకె, ఎఐడిఎంకె, టిఎంసి, ఎస్.పి తదితర పార్లమెంటరీ పార్టీల వ్యతిరేకతలను లెక్కజేయకుండా – 'పెన్షను ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ బిల్-2011' (పిఎఫ్ఆర్‌డిఏ-2011)కు పార్లమెంటు ఉభయసభలలోనూ ఆమోదం పొందగలిగింది.

దీనితో పెన్షను రంగంలోకి 26 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మార్గం సుగమం చేయటంతోపాటు, పెన్షనునిధుల నిర్వహణకుగానూ చట్టబద్ధతలేని, ప్రైవేటు ఫండు యాజమాన్యాలు, విదేశీ ప్రైవేటు ఫండు యాజమాన్యాలకు చట్టబద్ధ మద్దతును సమకూర్చినట్లయింది. మరో మాటల్లో 53 లక్షలమంది ఉద్యోగులు, కార్మికులు పెన్షను నిధులుగా కూడబెట్టుకున్న 35 వేల కోట్ల రూపాయల కార్పస్‌ఫండ్‌తో సహా పెద్దమొత్తంలోని ఈ రంగంలోని నిధులన్నింటినీ ప్రైవేటు, విదేశీ గుత్త సంస్థలకు స్టాకుమార్కెట్ల జూదంలో తమ చిత్తమొచ్చిన రీతిలో పణంగా పెట్టుకోవటానికి అప్పగించివేశారు. ప్రభుత్వం నుండి కార్మికులకు, ఉద్యోగులకు ఏవిధమైన హామీ లేకుండానే ఈ విధంగా పెన్షను నిధులను స్టాకుమార్కెట్టు జూదంలో పెట్టుబడులుగాపెట్టుకోవటానికి అనుమతినీయటంద్వారా పెన్షను నిధుల మదుపరులు తీవ్ర అభద్రతలోకి నెట్టివేయబడ్డారు.

సాధారణంగా ప్రభుత్వం పెన్షను ఫండుగా తనవద్ద పోగుపడిన నిధులను ప్రజల సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగిస్తూ వస్తున్నది. అయితే, సామ్రాజ్యవాద ప్రభువుల సేవలో తరిస్తున్న మన దేశ పాలకులు అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలలో లాగా-ముఖ్యంగా-అమెరికాలోలాగా, పెన్షను నిధులతో చేపట్టే ఈ సంక్షేమ కార్యకలాపాలను రద్దుచేసి వాటిని వ్యాపార కార్యకలాపాలుగా మలిచేందుకు అమితాసక్తి కనబరుస్తున్నారు.

అయితే, ఆ అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెన్షను నిధులను ప్రైవేటు ఫండు మేనేజర్లు స్టాకుమార్కెట్లలో పెట్టుబడులు పెట్టి, ఆర్థికమాంద్యం ఫలితంగా తీవ్రంగా నష్టాలపాలౌతున్నారు. దీనితో పెన్షను ఫండు మదుపరులైన కార్మికులు, ఉద్యోగులంతా ఉద్యోగ విరమణానంతరం ఎటువంటి భద్రతాలేక రోడ్లపైకి విసిరివేయబడుతున్నారు. అయినప్పటికీ, మన పాలకులు ఈ కఠిన వాస్తవంనుండి ఎలాంటి గుణపాఠాలూ నేర్చుకోవటానికి సిద్ధంగా లేరు. పైగా మనదేశ కార్మికుల, ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు నిర్దేశించిన విధంగా ఆర్థిక సంస్కరణలను ముందుకు గొనిపోయేందుకు అత్యుత్సాహం జూపుతున్నారు.

1991 తదనంతర కాలంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలైన నయాఉదారవాద ఆర్థిక విధానాల అమలు ప్రక్రియతో, పెన్షను ఖర్చు, భారం, బాధ్యతలను ప్రభుత్వాలు తగ్గించుకోవాలని – ప్రపంచ బ్యాంకు నుండి, మనదేశంలోని బడాబూర్జువావర్గం నుండీ – డిమాండ్ వస్తున్నది. దీనితో, ఆ తర్వాత వరుసగా పాలన సాగిస్తూవస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ప్రభుత్వోద్యోగులకు కల్పించే పెన్షను ఫండు సౌకర్యంతో సహా సామాజిక సంక్షేమ కార్యక్రమాలన్నింటి నుండీ క్రమంగా తప్పుకుంటూ వస్తున్నాయి. దీనిలో మొదటి అడుగుగా 2004లో అప్పటికి ఐదు దశాబ్దాలుగా అమలవుతూవస్తున్న పెన్షను లబ్ధి వ్యవస్థ అయిన, 'ఎంప్లాయీస్ పెన్షను స్కీము(ఇపిఎస్)'ను 'నూతన పెన్షను స్కీము' (ఎన్‌పిఎస్) పేరుతో కాంట్రిబ్యూటరీ పెన్షను విధానంగా మార్చివేసి 2004 జనవరి ఒకటి తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరికీ ఖచ్చితంగా వర్తింపజేస్తున్నారు.

ప్రస్తుతం 'సంపాదిస్తూనే పొదుపు చేయి' అనే ఆకర్షణీయమైన నినాదంతో మన పాలకులు, ప్రభుత్వాలు ఎన్‌పిఎస్‌లో పొదుపు చేయవలసిందిగా ప్రైవేటు రంగంలోని, అనియత రంగంలోని కార్మికులలో ప్రచారం చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. తద్వారా కార్మికుల కష్టార్జితం నుండి పొదుపు చేయబడిన పెద్దమొత్తాలను దేశంలోని బడాపెట్టుబడిదారులకు, విదేశీ గుత్తసంస్థలకు, స్టాకు మార్కెట్టు జూదంలో మదుపుజేసుకోవటానికి, వాటిపై లాభాలార్జించటానికి మన పాలకులు 'ఇతోధికంగా' తోడ్పడుతున్నారు.

మనదేశ పాలకులు, పాలకవర్గాలు ఈ వాస్తవాలను కప్పెట్టటానికి, ప్రైవేటుఫండు మేనేజర్లు ఈ నిధులను మరింత సమర్థవంతంగా వినియోగించి, వీటిపై అధిక లాభాలార్జిస్తారు కనుక, ఈ న్యూపెన్షను స్కీములో పొదుపుచేసిన ఫలితంగా కార్మికులు తమ పొదుపు మొత్తాలపై అత్యధిక మెరుగైన ఫలితాలను పొందగలుగుతారని మభ్యపరుస్తున్నారు.

పిఎఫ్ఆర్‌డిఏ-2011 చట్టంతో పెట్టుబడిదారీ వర్గం సంతృప్తిచెందకుండా, ఇపిఎఫ్ఓ(ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్)లో కార్మికులు తమ కష్టార్జితంనుండి పొదుపుచేసుకున్న అధిక మొత్తాలను సమర్థవంతమైన నిర్వహణకోసమంటూ ప్రైవేటు ఫండు మేనేజర్లకు అప్పగించాలని డిమాండ్‌చేస్తోంది.

ఈవిధంగా ఒకవైపున మన ప్రభుత్వాలు, పాలకులు, పాలకవర్గాలు – కార్మికులకు పెన్షను, భద్రత కల్పించాల్సిన తమ బాధ్యత నుండి తప్పుకుంటూ మరోవైపున కార్మికుల పొదుపు మొత్తాలను ప్రైవేటు, విదేశీ ఫండు మేనేజర్ల దయాదాక్షిణ్యాలకు వదిలివేస్తున్నారు. స్టాకుమార్కెట్టు జూదంలో పణంగాపట్టే ఈ మొత్తాల అసలుకే ఎసరువచ్చే తీవ్రమైన ప్రమాదాలు ఇందులో పొంచివున్నాయి.

మనదేశ కార్మికులను, శ్రమజీవులను ఈవిధంగా పాలకులు, పాలకవర్గాలు మోసగిస్తున్నారు. మనదేశ కార్మికవర్గం-ప్రజలు, కార్మికవర్గంపై సాగుతున్న ఈ బహుముఖమైన మోసాలను, దోపిడీని గ్రహించి, పెట్టుబడిదారీ దోపిడీని అంతమొందించే అంతిమ లక్ష్యంతో తామంతా సంఘటితశక్తిగా నిర్మాణయుతమై తమ హక్కుల రక్షణకు నడుం బిగించాలి. ✡

ALL INDIA WORKERS, PEASANTS & AGRICULTARAL LABOUR SAMMELAN



# గుజరాత్ ఎన్‌కౌంటర్ హత్యల నేరాల నుండి పాలకులూ, పోలీసు అధికారులు తప్పించుకోజాలరు

**గుజరాత్** రాష్ట్ర డిజిపి వంజారా తన హయాంలో సాగించిన 'టెర్రరిస్టు అనుమానితుల' బూటకపు ఎదురుకాల్పుల హత్యాకాండ కేసులో గత కొంతకాలంగా జైలులో వుంటూ ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. రాజీనామా పేరిట అతను విడుదల చేసిన లేఖలో తన ఆధ్వర్యంలో ఉగ్రవాద అనుమానితులను బూటకపు ఎదురుకాల్పుల పేరిట హత్యగావించటాన్నుండి నరేంద్రమోడీ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వమూ తనను రక్షించలేదని దుయ్యబట్టాడు. తను, మరియు తనతో పాటుగా నకిలీ ఎన్‌కౌంటరు కేసులలో ముద్దాయిగా జైలులో నిర్భంధించబడిన తన సహ అధికారులంతా 2002-07 సం॥లలో, గోధ్రా దాడుల అనంతరకాలంలో, తీవ్రవాదులను మట్టుబెట్టడం కోసం గుజరాత్ ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన నిర్ణయానికనుగుణంగా మాత్రమే వ్యవహరించామని నిస్సిగ్గుగా వాదన చేశాడు. తను, తన సహఅధికారులు గుజరాత్ ప్రభుత్వం రూపొందించిన విధానాన్ని అమలుచేసిన వాళ్ళము మాత్రమేననీ, కనుక తమ వెన్నంటివుండి, ఈ కార్యక్రమానికి పురిగొల్పి, మార్గనిర్దేశంచేసి, పర్యవేక్షించిన విధాన నిర్ణాయకులైన వారిని మొదట అరెస్టుచేయాలని ఆయన వాదన చేశాడు. ఇంకా, గుజరాత్ ప్రభుత్వం వుండవలసింది గాంధీనగర్‌లో కాదనీ, నవీ ముంబాయిలోని తలోజా కేంద్ర కారాగారంలోనో లేదా సబర్మతీలోని కేంద్ర కారాగారంలోనో వుండాలనే తన నిశ్చితాభిప్రాయాన్ని ఆయన ఈ లేఖలో వ్యక్తంచేశాడు. గుజరాత్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం తన రాజకీయ లబ్ధికోసం గత 12సం॥లుగా ఈ తరహా ఎన్‌కౌంటర్లను సాగిస్తోందని కూడా ఆయన పేర్కొన్నాడు. ఈ విధమైన వక్కాణింపులతో పాటుగా తనూ, తన సహ అధికారులు సాగించిన ఈ చర్యలలో ఢిల్లీ పీఠం దిశగా అడుగులు కదుపుతున్న మోడీ - తన 'వాటాను' తాను పొందవలసి వుంటుందని హెచ్చరించాడు.

ఏమైనా ఈ విధంగా, తన రాజీనామా లేఖ ద్వారా మరోసారి ఈ క్రింది వాస్తవాలను వెల్లడిచేశాడు :

(a) 'ఎన్‌కౌంటర్ల'న్నీ అధికారంలో కొనసాగుతున్న ప్రభుత్వాలు, పాలకులు ప్రాయోజితం చేసినవే.

(b) పాలకుల ప్రయోజనాల కోసమే బూటకపు ఎన్‌కౌంటర్లు సాగించబడతాయి. పాలకులు మరియు పాలకవర్గ పార్టీల ఆదేశాల ప్రకారం, ప్రభుత్వాలు వాటి రాజకీయ లబ్ధికోసం వీటిని సాగిస్తాయి.

(c) చట్టం, రాజ్యాంగ సూత్రాలకు లోబడి విధులు నిర్వహిస్తారని చెప్పబడుతున్న పోలీసులు అధికారులు వాటిని ప్రక్కనబెట్టి ఉద్దేశపూర్వకంగా తమ స్వీయ, వస్తుగత ప్రయోజనాలనాశించి అధికారంలోని పాలక పార్టీల, పాలకుల ప్రయోజనాల కోసం, బూటకపు ఎదురుకాల్పుల పేరుతో చట్టవిరుద్ధ హత్యాకాండకు పాల్పడుతున్నారు.

తన ఆధ్వర్యంలో జరిగిన బూటకపు ఎదురుకాల్పుల హత్యాకాండపట్ల ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా ఐపిఎస్ పోలీసు అధికారి వంజారా రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట వ్యతిరేకంగా తాను సాగించిన హత్యలను చాలా తలపొగరుతో, నిస్సిగ్గుగా సమర్ధించుకొజూశాడు.

పైగా, చట్టవ్యతిరేక బూటకపు హత్యాకాండ సాగించిన పోలీసు అధికారులకు రక్షణ కల్పించి, శిక్షల నుండి వారిని తప్పించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. కావున దీనిని బట్టి చట్టవిరుద్ధ, బూటకపు ఎదురుకాల్పుల హత్యలనేవి పోలీసు బలగాలలో ఆమోదించబడిన విధానంగా వుందని, గత 66 సంవత్సరాల 'అధికారమార్పిడి' తదనంతర కాలంలో పాలకులు, పాలకవర్గ పార్టీలు తర తమ బేధాలతో ఇవే విధానాలను ఆమోదించి, కొనసాగిస్తున్నాయని స్పష్టమౌతోంది.

మనదేశంలో బూటకపు ఎదురు కాల్పుల హత్యాకాండ యొక్క తీవ్రత ఇది కాగా, ఈ విధానం అధికారంలోనున్న ప్రభుత్వం, పాలకులతో విభేదించే ప్రతి ఒక్క పౌరుని ప్రాణాన్ని ప్రమాదంలోకి నెట్టున్నది. ప్రచార మాధ్యమాలలో మాత్రం ఈ వార్తలను కేవలం సంచలనాత్మక వార్తా కథనాలకే పరిమితం చేస్తున్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై; బిజెపి, నరేంద్రమోడీపై దీని ప్రభావం ఎలా వుండబోతుందనే విశ్లేషణలు, చర్చలు మాత్రమే సాగిస్తున్నారు. అంతేగానీ, ప్రజాస్వామిక దేశంగా చెప్పబడుతున్న మన దేశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరింపజాలని బూటకపు ఎన్‌కౌంటరు హత్యల యొక్క చట్ట విరుద్ధతను, నీచత్వాన్ని, అనామోదతను వెల్లడిగాకుండా ప్రక్కదోవ పట్టిస్తున్నారు.

రాజ్యం, వివిధ పాలకపార్టీల ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు అనుసరిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలను, ఫాసిస్టు తరహా విధానాలను వ్యతిరేకించి, ఖండించటానికి బదులుగా మేధావులుగా చెప్పబడే కొందరు తమ వ్యాసాల ద్వారా చర్చల ద్వారా బూటకపు ఎన్‌కౌంటరు హత్యలను ప్రజాస్వామిక దేశాలుగా చెప్పబడుతున్న దేశాలలో అనివార్య చర్యలుగా పేర్కొంటూ సమర్ధనలు సాగిస్తున్నారు. వారు ఈ క్రింది విధమైన వాదనలు చేస్తున్నారు :

(a) గుజరాత్‌లో బిజెపి నాయకత్వంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం మాత్రమే గాక 1970లో సిద్ధార్ధ శంకర్‌రే నాయకత్వంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వమూ, వెంగళరావు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ నక్సలైట్లను ఎన్‌కౌంటర్లలో హతమార్చాయి; 1980 ప్రాంతంలో పంజాబ్‌లో ఖలిస్థాన్ ఉద్యమ కార్యకర్తలను ఎన్‌కౌంటర్లపేరిట హత్యగావించారు; ఈ ఎన్‌కౌంటర్లన్నీ కాంగ్రెస్ పార్టీ యొక్క ఆశీస్సులతో జరిగినవే.

(b) తదనంతర కాలంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా నక్సలైట్లకు వ్యతిరేకంగా ఇదే వైఖరి చేపట్టింది. వైయస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కూడా - ప్రాథమికంగా కొంత తటపటాయించినా, ఇదే విధానాన్ని కొనసాగించింది.

(c) అమెరికాలో టాస్క్‌ఫోర్సు-333గా పిలవబడే ప్రత్యేక బలగాల విభాగం కూడా 'పేరొందిన' ఉగ్రవాదులను కోర్టులలో ప్రవేశపెట్టి విచారణ జరిపేందుకు ప్రయత్నించకుండా వెంటాడి, వేటాడి హతమార్చటానికే ప్రత్యేకంగా రూపొందించబడింది. దీని ప్రకారమే నిరాయుధంగా వున్న ఒసామాబిన్ లాడెన్‌ను పట్టి బంధించి హతమార్చారు.

(d) రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధం సాగిస్తున్న వారిని పట్టుకొని తగిన విధంగా శిక్షించలేని మన నేర న్యాయ శిక్షాస్మృతి యొక్క వైఫల్యం ఫలితంగానే ఎన్‌కౌంటర్లు సాగుతున్నాయి.

(e) తిరుగుబాటుదారులను ఎన్‌కౌంటర్లు చేయటానికి సామాజిక ఆమోదం లభించినంత కాలం, రాజకీయంగా లోబరచుకునేందుకు రాజ్యాంగ విరుద్ధమైన విధానాలననుసరించి ఈ విధమైన ఎన్‌కౌంటర్లు కొనసాగుతాయి.

(f) ప్రజాస్వామిక సూత్రాల పట్ల గౌరవం లేనివారితో వ్యవహరించేందుకు సాంప్రదాయ ప్రజాస్వామిక సూత్రాలు ఎందుకూ కొరగావు

(g) వంజారా మరియు అతని సహ పోలీసుఅధికారులు ప్రైవేటు యుద్ధం సాగించలేదు; వారు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా రాజ్యం యొక్క ప్రయోజనాలను పరిరక్షించటం కోసమే ఈ చర్యలు చేపట్టారని గుర్తించాలి.

(h) శాంతియుతంగా జీవించే భారతీయుల పౌరహక్కులు, మానవ హక్కులు మరీ ముఖ్యంగా 'జీహద్' ఉగ్రవాదుల హక్కులకంటే చాలా ప్రాముఖ్యం గలవిగా గుర్తించటం అత్యంతావశ్యకమైనది.

ఈ విధమైన దురభిమానంతో కూడిన ప్రక్కదోవ పట్టించే తమ వాదనలతో మన ప్రజాస్వామ్య 'యోధులు' పరోక్షంగా మన దేశంలో రాజ్యం, పాలకులు, పాలకవర్గ శక్తులు సాగించే బూటకపు ఎన్‌కౌంటర్ హత్యల విధానాన్ని నిస్సిగ్గుగా సమర్ధిస్తున్నారు. ఒకవైపున ఈ తరహా విధానానికి సామాజిక ఆమోదం వుందని చూపే ప్రయత్నంచేస్తూనే, మరోవైపున ఈ తరహా విధానం ప్రజాస్వామిక విధానాల పట్ల గౌరవంలేని శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఒక అనివార్యమైన, ఆవశ్యమైన అంశంగా ముందుకు వస్తుందనే తప్పుడు అభిప్రాయం కల్గించే ప్రయత్నం చేస్తున్నారు. తమ కుటిలపూరిత లక్ష్యాలను సాధించుకునేందుకు వీరు హక్కుల ఉద్యమాలను, హక్కుల ఉద్యమ కార్యకర్తలను మరియు మానవహక్కుల భావనను కూడా అపహాస్యం చేస్తున్నారు. సారాంశంలో వీరు రాజ్యం, పాలకులు సాగించే బూటకపు ఎన్‌కౌంటరు హత్యల విధానాన్ని ఆమోదించడమే కాకుండా, ఈరకమైన ప్రజావ్యతిరేక ఫాసిస్టు తరహా విధానాలకు మద్దతు పొందేందుకు ప్రజల వద్దకు వెళ్ళేందుకు నైపుణ్యంతో కూడిన కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు.

మన దేశం ఇప్పటికే ఎమర్జెన్సీ ఫాసిస్టు పాలన చీకటి రోజులలో ప్రజలపై క్రూర నిర్బంధం, అణిచివేతలను చవిచూసింది. నకిలీ ఎన్‌కౌంటర్లలో నక్సలైట్లను దారుణంగా హత్యగావించటాన్ని మనం చూస్తూనే వున్నాం. ఎఎఫ్ఎస్‌పిఎ వంటి చట్టాలతో సాయుధమైన సైనికబలగాలు - ఈశాన్య రాష్ట్రాలు, కాశ్మీర్‌లలో చట్టవిరుద్ధంగా వందలాదిమంది అమాయకులను హత్యగావించటాన్ని, అదే విధంగా జీహదీ ఉగ్రవాదులను చట్టవిరుద్ధంగా హత్యగావించటాలను, అమాయక ముస్లిం యువకులపై తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని కొనసాగించటాన్ని మనం గమనిస్తూనే వున్నాం. ప్రత్యర్ధులు ఏరూపంలో వున్నా వారిని ఫాసిస్టు చర్యలు, నిర్బంధంతో అణిచివేసే హేయమైన, క్రూరమైన, అమానవీయమైన చర్యలే ఇవన్నీ!

రాజ్యాంగ విరుద్ధమైన, చట్ట విరుద్ధమైన నకిలీ ఎన్‌కౌంటర్ హత్యలు సాగించటాన్ని; రాజ్యం మరియు పాలకులు, వారి పాలకవర్గ పార్టీలు దానికి ఆమోదముద్ర వేయటాన్ని తీవ్రంగా ఖండించి, వ్యతిరేకించకుంటే; నిజమైన ప్రజాస్వామ్యహక్కుల ఉద్యమ నిర్మాణం గావించకుంటే, ప్రస్తుత నకిలీ ఎన్‌కౌంటరు హత్యల ప్రమాదం-నక్సలైట్లు, ఉగ్రవాదులు, జీహద్ టెర్రరిస్టులకు మాత్రమే పరిమితమై వుండదు; అది పాలకుల, పాలకవర్గాల విధానాలతో, అభిప్రాయాలతో విభేదించే వారందరి వద్దకు విస్తరిస్తుంది. ఈ విధాన రూపకర్తలు గానీ, విధానాన్ని అమలుపరిచే అధికారులు కానీ ఈ తరహా నకిలీ ఎన్‌కౌంటరు హత్యల దుష్పరిణామాల నుండి తప్పించుకోజాలరు.

పాలకులు, పాలకవర్గాలు - ఈ విధానాలను అమలుచేసిన అధికారులపైకి దోషాన్ని నెట్టివేసి, తాము విముక్తం గాలేరు. అదేవిధంగా ఈ విధానాలను అమలుచేసే అధికారులు కూడా తాము నిర్దోషులమనో, లేదా అధికారంలోనున్న పాలకుల, పాలకవర్గ పార్టీలను తాము శాసించలేమనో కనుక వారుచేసిన విధానాలను అమలుచేసే వారిమి మాత్రమే గనుక, తమ తప్పిదంలేదని ప్రకటించి - తాము చేసిన నేరాల నుండి తప్పించుకోజాలరు. ✡

# బిటి ప్రత్తి రైతాంగం పాలిట పెను శాపం

**జూలై 28,** సెప్టెంబరు 9ల మధ్య 12 రోజులలో ఆదిలాబాద్‌జిల్లాలో 22 మంది ప్రత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పంట దిగుబడి తగ్గటం, అప్పులు పేరుకు పోయినందున వీరు ఈ తీవ్ర చర్యకు పూనుకున్నారు. వీరందరూ కౌలుకు తీసుకున్న భూమిలో ప్రత్తి పంటను వేసిన వారే. గత రెండేళ్లుగా నష్టాలపాలై అప్పులలో కూరుకుపోయి వున్నారు.

జిల్లాలోని రైతాంగం అతివృష్టి, వరదల మూలంగా అన్నిరకాల పంటలనూ నష్టపోయారు. అయితే ప్రత్తిపంట వేయటానికి అప్పులు చేసిన రైతాంగం కోలుకోలేని నష్టాలకు గురై ఆత్మహత్యలు చేసుకున్నారు. జిల్లాలో వేసిన ప్రత్తిపంటలో 95శాతం పైగా బిటిరకానికి చెందినదే. ఇక బ్యాంకులనుండిగానీ, వడ్డీ వ్యాపారుల నుండిగానీ అప్పుపుట్టే అవకాశం లేదని తెలిపోవటంతో వారు తమ ఉసురు తీసుకున్నారు.

అతివృష్టి వరదలతో జిల్లాలో 3.1 లక్షల హెక్టార్లలో వేసిన ప్రత్తిపంట దెబ్బతిన్నది. ఎకరాకు 4 క్వింటాళ్ళు దిగుబడి రావటం కూడా కష్టమైంది. ఇది పత్తితీసిన కూలి ఖర్చులకు కూడా సరిపోదు. సీజను ముగింపు కొచ్చేసరికి మరిన్ని ఆత్మహత్యలు జరుగుతాయని పరిశీలకులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

అయినా రాష్ట్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న వారికి కష్టాలలో ఉన్న రైతాంగానికి సహాయమందించి వారు సాగు కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకునే ఆలోచన కూడా చేయలేదు. కాగా తామే చిక్కుముడులు వేసిన రాష్ట్రవిభజన సమస్యను పీటముడిగా చేసే పనిలో పాలకులు నిమగ్నమైపోయారు. కేంద్రంలోని పాలకులు బిటిప్రత్తి సాగువల్ల ఒనగూడే లాభాల ప్రచారంతో బిటి విత్తన కంపెనీల లాభాల ప్రోత్సాహకాల పని నిర్వర్తిస్తున్నారు.

మహారాష్ట్రలోని యావత్‌మల్‌జిల్లా విదర్భ ప్రాంతంలో వుంది. ఈ ప్రాంత జిల్లాల్లో జరిగిన ప్రత్తిరైతుల ఆత్మహత్యల్లో ఎక్కువ యావత్‌మల్‌లోనే జరిగాయి. వీరందరూ ప్రత్తి రైతులే. ఈ జిల్లా రైతులు ప్రత్తి సాగునుండి సోయాబీను సాగుకు మారుతున్నారు. గత ఏడాది వేల హెక్టార్లలో ప్రత్తి బదులు సోయాబీను పంటవేశారు. 2013లో ప్రత్తి, సోయాబీను పంటల విస్తీర్ణం సమానంగా వుంది.

ఇన్నాళ్లూ ఈ రైతాంగం వేసిన ప్రత్తి పంట బిటి రకానికి చెందినదని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. ఈ జిల్లాకు చెందిన ఒక రైతు ఇలా అన్నాడు. "ప్రభుత్వం ప్రత్తికి కనీస మద్దతు ధరగా రూ.10వేలు చెల్లించినా ప్రత్తి సాగు లాభదాయకంగా వుండదు. ఎందుకంటే బిటి ప్రత్తి ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా వుంది. సోయాబీను సాగుచేస్తే కనీసం ఖర్చులన్నా తిరిగి వస్తాయి".

ఈ మార్పు ఒక్క ఈ జిల్లాకే పరిమితం కాదు. "విదర్భ ప్రాంతంలోని అమరావతి డివిజన్‌లో, ప్రత్తిపంట విస్తీర్ణం గత ఐదేళ్లలో 15 లక్షల హెక్టార్లనుండి 8.5 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. ఇదేకాలంలో సోయాబీను పంటవిస్తీర్ణం 8 నుండి 15.6 లక్షల హెక్టార్లకు పెరిగింది" అని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు తెలిపారు.

వాస్తవానికి యిది ఒక పార్శ్వం మాత్రమే. పెద్ద కమతాలు కలిగిన రైతులు ప్రత్తినుండి సోయాబీనుకు మారగలుగుతుండగా, పేద రైతాంగానికి అది కష్టసాధ్యమౌతున్నది.

ఇంతేకాక, "కనీసం ఖర్చులన్నా తిరిగి వచ్చే" సోయాబీను పంట కూడా వాణిజ్య పంటే. దీని కొనుగోలుదారులు కూడా సోయాబీను పరిశ్రమాధిపతులే. పంట విస్తీర్ణం పెరిగినప్పుడు పరిశ్రమాధిపతులు రేటు దిగకొస్తారన్నది రైతాంగం చవిచూసిన చేదు అనుభవమే. ఈ "కనీసం ఖర్చులన్నా తిరిగి వచ్చే స్థితి" ఎన్నాళ్లుంటుందో చెప్పలేము.

కాగా, రైతాంగానికి గౌరవప్రద జీవనాన్ని యివ్వగల ప్రత్యామ్నాయ పంటల సాగును పాలకులు ప్రోత్సహించటంలేదు. కాగా జన్యుమార్పిడి పంటల గొప్పదనాన్ని పొగడుతున్న కేంద్రప్రభుత్వమూ, విత్తన కంపెనీల ప్రతినిధులతో నింపిన బిఆర్ఎఐ సోయా పంటలో కూడా జన్యుమార్పిడి పంటల ప్రవేశానికి రంగం సిద్ధంచేస్తున్నాయి. ఈ విధానం ఆర్ధిక దుస్థితినుండి బయటపడే మార్గాలను వెదుక్కుంటున్న రైతాంగాన్ని మళ్లీ జన్యుమార్పిడి పంటల ఉచ్చులోకి లాగుతుంది. ఏ పంటవేసినా లాభాలు కంపెనీలకు; నష్టాలు రైతాంగానికి!

ప్రతి ఏటా భారతదేశంలో 110 కోట్ల డాలర్ల విలువైన విత్తన వ్యాపారం జరుగుతోంది. సంవత్సరానికి 12శాతం పెరుగుదలతో ప్రపంచంలోనే 6వ అతిపెద్ద విత్తన వ్యాపారకేంద్రంగా మనదేశం వుంది.

దీనిలో హైబ్రిడ్ విత్తన వ్యాపారం 58 కోట్ల 50 లక్షలడాలర్లుకాగా, దానిలో బిటి ప్రత్తి విత్తన వ్యాపారం 35 కోట్ల డాలర్లుగా వుంది. దీనిలో అత్యధిక వాటా బహుళజాతి పరిశ్రమల చేతుల్లో వుంది. 'మహికో' భారతదేశంలో మాన్‌శాంటో అనుబంధ పరిశ్రమగా వుంది. ప్రపంచ అతిపెద్ద పురుగుమందుల పరిశ్రమ 'బేయర్' యొక్క భారతీయ విభాగంగా వున్న 'బేయర్ బయోసైన్సెస్' 500 కోట్ల రూ॥ చెల్లించి కావేరీ సీడ్స్ అనే భారతీయ కంపెనీని కొనుగోలు చేస్తోంది.

రైతుల నిరంతరాయ పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బిటి విత్తన ధరలను నియంత్రించే చట్టం చేసింది. అదేరీతిలో మహారాష్ట్ర, గుజరాతు ప్రభుత్వాలు కూడా చట్టాలు చేశాయి. ధరల నియంత్రణ చట్టం చేయకముందు 450 గ్రాముల బిటి ప్రత్తి విత్తన ప్యాకెట్ ధర 1600 రూ॥లు వుండగా, తదనంతరం అది 450 రూ॥కు తగ్గింది.

ఈ చట్టం ప్రకారం, సంబంధిత పరిశ్రమ హామీ ఇచ్చిన విధంగా సాగు ఫలితాలు చూపకుంటే, ఆయా విత్తన పరిశ్రమలు రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం చెల్లించాలి. దీనితో విత్తన పరిశ్రమలు ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల హైకోర్టులలో సవాల్ చేశాయి. గుజరాతు రాష్ట్ర హైకోర్టు, అత్యవసర సరుకుల చట్టానికి ఈ చట్టం విరుద్ధంగా వుందంటూ దీనిని కొట్టివేసింది. కాగా, మిగిలిన రాష్ట్రాల హైకోర్టులలో ఇంకా ఈ కేసు పెండింగ్‌లో వుంది. ఈ మధ్యకాలంలో బిటి విత్తనాల వైఫల్యంతో పంట నష్టపోయి దివాలా తీసిన రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు విత్తన కంపెనీలు నిరాకరిస్తున్నాయి. ఈ విధంగా బిటి విత్తనాలు రైతుల పాలిట శాపంగా మారాయి. అయినా, ఇప్పటికీ ప్రభుత్వం బిటి విత్తనాలను ప్రోత్సహించటంలో అత్యుత్సాహంగా వుంది. కనుక సాగు గౌరవప్రద జీవన ఉపాధిగా వుండేందుకు ఆటంకంగా వున్న ప్రభుత్వ విధానాల మార్పుకొరకు రైతాంగం నడుంబిగించాలి. ✡

# 'పాలకుల దోపిడీ విధానాలపై కార్మికులు, రైతాంగం సంఘటిత పోరాటాలు సాగించాలి'

## ఏఐఎఫ్‌టియు(న్యూ), రైకూసం(ఆం.ప్ర) గుంటూరు జిల్లా సదస్సులో కా॥ జి.విజయకుమార్

**పిడుగురాళ్ళ, 6-10-13 :**

'భూ సంస్కరణలు – కౌలు రైతుల అవస్థలు – అసంఘటిత కార్మికుల సమస్యలు – ధరల పెరుగుదల'లపై గుంటూరు జిల్లా ఏఐఎఫ్‌టియు (న్యూ), ఏఐకెఎమ్‌కెఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లెనిన్‌నగర్‌లో కార్మిక రైతాంగ జిల్లాస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఇరు సంస్థల నాయకులు కామ్రేడ్స్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, రాంబాబు, భాస్కర్, అమరలింగం, శ్రీనివాసరావులు – అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

తొలుత, సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ సదస్సులో ప్రసంగిస్తూ బ్రిటీష్ వలసపాలన కాలంలో జాతీయోద్యమంలో భాగంగా స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ఒక విధానంగా ముందుకు వచ్చిందన్నారు. ఆనాడు ప్రజలపై దోపిడీ పీడనలు సాగించిన జమిందారులు, జాగీర్‌దారులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 'దున్నేవానికే భూమి' నినాదంతో పెద్దఎత్తున పోరాటాలు సాగాయని; ప్రజలు అనేక విజయాలు సాధించుకున్నారన్నారు. అలాగే రైతాంగాన్ని రుణభారం నుండి విముక్తి చెందించాలని, వ్యవసాయాభివృద్ధికి సహకార విధానం ఒక డిమాండ్‌గా ముందుకు తెచ్చారని, కానీ అధికార మార్పిడి తదనంతరం పాలన సాగిస్తున్నవారంతా ఈ నినాదాలకు ఇప్పటివరకూ



సదస్సుకు హాజరైన ప్రజానీకం – సదస్సులో ప్రసంగిస్తున్న విజయకుమార్

కార్యరూపం ఇవ్వకపోగా, వీటిని అమలుచేయాలన్న వారిపై క్రూర నిర్బంధాలను ప్రయోగిస్తున్నారన్నారు. ఫలితంగానే నేటి వ్యవసాయరంగం తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, లక్షలాది మంది రైతుల ఆత్మహత్యలతోపాటు రెంటచింతల ప్రాంతంలో కొనసాగుతున్న రైతుల కిడ్నీ విక్రయాలు అందులో భాగమేనన్నారు. ఈ స్థితిలో, భారత ప్రజానీకం – రైతాంగం – కార్మిక, శ్రామిక ప్రజానీకమంతా సామ్రాజ్యవాదులకు దాసోహం చేస్తున్న భారత పాలకుల దళారీ విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డి.వి.ఎన్.స్వామి మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికులు రోజుకు 12గం॥లు పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనం కూడా పొందలేకపోతున్నారని; దేశంలోని 93శాతం అసంఘటిత కార్మికుల శ్రమను విదేశీ, దేశీయ గుత్తపెట్టుబడి సంస్థలు జలగల్లా పీల్చి పిప్పిచేస్తున్నాయని, కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక సంక్షేమ చట్టాలను కూడా అమలుచేయకుండా, కార్మికుల హక్కులన్నింటినీ కాలరాచివేస్తున్నారని ఈ నేపథ్యంలో సామాజిక మార్పుకోసం కార్మికవర్గ నాయకత్వాన యావత్తు ప్రజానీకం పోరాటాలు సాగించాల్సిన అవసర ముందన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)జిల్లా అధ్యక్షులు కా॥ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కౌలురైతులకు సంస్థాగత రుణాలు అందక, గిట్టుబాటు ధరలు లభించక, అప్పులపాలై ఆత్మహత్యలకు నెట్టబడుతున్నారని; గ్రామీణపేదలు, వ్యవసాయకూలీలు, హమాలీలు, చేతివృత్తిదారులు, బట్టీలు, మిల్లులలో పనిచేసే శ్రామికులు – పెరుగుతున్న నిత్యజీవితావసర వస్తువుల ధరలతో ఏమాత్రం పొంతనలేని వేతనాలతో బతుకులు దుర్భరంగా సాగిస్తున్నారని, ప్రజావ్యతిరేక పాలకుల విధానాలపై పోరాటం మినహా వీరందరి ముందూ మరో మార్గం లేదన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కా॥ ఎస్.లలితకుమారి మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిన పాలకుల విధానాల ఫలితంగా, వివిధ ప్రాంతాల ప్రజల అభివృద్ధికై న్యాయమైన డిమాండ్లు ముందుకొస్తున్నాయని, ఆ డిమాండ్లను పరిష్కరించకుండా ప్రాంతాల ప్రజల మధ్య విద్వేషాలను రగుల్కొలిపే ప్రాంతీయ ఉద్యమాలను పాలకులే పెంచిపోషిస్తూ, సమస్యల నుండి ప్రజలను ప్రక్కదోవ పట్టిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పాలకుల దోపిడీ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఇంకా సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు; కా॥ యస్.లక్ష్మారెడ్డి; పద్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజాకళాకారులు నృత్యరూపకాలు, జనంపాటలు, డప్పునృత్యాలు ప్రదర్శించారు. ఈ సదస్సుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి కౌలురైతులు, వ్యవసాయ కూలీలు, సన్న – చిన్నకారు రైతులు మరియు క్వారీలు, బట్టీలు, క్రషర్లు, సున్నంబట్టీల, మిల్లుల – హమాలీలు, కార్మికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ★

# ఏఐఎఫ్‌టియు (న్యూ), ఏఐకెఎమ్‌కెఎస్‌ల సావనీర్ ఆవిష్కరణ సభ



సావనీర్ ఆవిష్కరణ

**విజయవాడ, 3-10-13:**

అర్ధవలస, అర్ధఫ్యూడల్ వ్యవస్థగా వున్న మన దేశంలో జనతా ప్రజాతంత్ర విప్లవం విజయవంతం కావాలంటే కార్మిక-కర్షక ఐక్యత పునాది ప్రధానమైన అంశం అని ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత అధ్యక్షులు కా॥గుర్రం విజయకుమార్ పేర్కొన్నారు. ఏఐఎఫ్‌టియు (న్యూ), ఏఐకెఎమ్‌కెఎస్ సంస్థలు సంయుక్తంగా 2011 డిసెంబరు 18న విశాఖపట్టణంలో నిర్వహించిన అఖిల భారత కార్మికుల, రైతుల మరియు వ్యవసాయకూలీల సమ్మేళనంయొక్క విశేషాలు-సందేశాలు-ఉపన్యాసాలతో తెచ్చిన ఇంగ్లీష్ సావనీర్ ఆవిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. 3-10-13న విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన ఈ ఆవిష్కరణ సభకు వి.లక్ష్మణరావు (ఏఐఎఫ్‌టియు-న్యూ) అధ్యక్షత వహించారు.

సావనీర్ ఆవిష్కరణ అనంతరం గుర్రం విజయకుమార్ తన ప్రసంగం కొనసాగిస్తూ మనదేశ ప్రజానీకం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి వున్నారనీ, అయితే అత్యధిక భూమి భూస్వాముల చేతిలో కేంద్రీకరించబడి వుందనీ, మనదేశ వ్యవసాయరంగంతో పాటు పారిశ్రామికరంగం కూడా అభివృద్ధిచెందాలంటే దున్నేవానికే భూమి దక్కేలా వ్యవసాయ విప్లవం సాగాలని, కార్మికవర్గ నాయకత్వాన కార్మిక-కర్షకమైత్రి పునాదిగా జనతా ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యదర్శి కా॥ కె.కోటయ్య మాట్లాడుతూ అంతర్జాతీయంగా రష్యా, చైనా విప్లవాలు అనేక అనుభవాలను అందించాయనీ, ముఖ్యంగా చైనావిప్లవం కార్మిక-కర్షకమైత్రి ప్రధానంగా సాగిన విప్లవమనీ, మనదేశంలో వ్యవసాయ విప్లవాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి ఎంతో దోహదపడుతుందనీ, పాలకుల భూసంస్కరణలు బూటకమని తేలిపోయిందనీ, కావున విప్లవ భూసంస్కరణలకోసం పోరాటం సాగించాలని, కొమరయ్య అమరత్వంతో ఊపందుకొని భూమిని స్వాధీనం చేసుకొనే వరకు సాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం మనదేశ విప్లవానికి అనేక విలువైన అనుభవాలను అందించిందనీ, అదే సమయంలో అతివాద, మితవాద ధోరణులు విప్లవోద్యమానికి కల్గించిన నష్టాలు తక్కువకాదనీ; జాతీయంగా, మన రాష్ట్రంలో సాగిన కార్మిక, రైతాంగ ఉద్యమాలు అందించిన అనుభవాల వెలుగులో ఉద్యమాలు సాగించటానికి పోరాటస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శి కా॥వై.సోనీ మాట్లాడుతూ, నేడు రూపాయి విలువ దిగజారిపోవటానికి మన పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలు ముఖ్యమనీ, దిగుమతులు ఎక్కువై ఎగుమతులు తగ్గిపోతున్నందున, విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరవడంవలన మనదేశ ఆర్థికవ్యవస్థ నానాటికీ సంక్షోభంలో కూరుకుపోతున్నదనీ, సంస్కరణల్లో భాగంగా అన్నిరకాల వస్తువులపై భవిష్య వాణిజ్యాన్ని అనుమతించటం వలన అన్నివస్తువుల ధరలు పెరిగిపోతున్నాయనీ, ఈ విధానాలవలన దళారీ శక్తులు బాగుపడ్తున్నారనీ, నానాటికీ పెరుగుతున్న వ్యవసాయరంగ సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి సంఘటిత పోరాటాల ఆవశ్యకతను గుర్తుచేశారు.

ఇంకా ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ టి.పూర్ణచంద్రరావు, కా॥ జగ్గారపు సుబ్బారావు; ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి కా॥యు. వీరబాబు తదితరులు ప్రసంగించారు. ★

# రొయ్యల ప్రాసెసింగ్ పరిశ్రమలో 'ప్రమాదం'-ఎన్‌వైయస్ నిజనిర్ధారణ

**నెల్లూరు, 10-10-13:**

నెల్లూరులోని స్టార్ ఆక్వామెరైన్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ కర్మాగారంలో 9-10-13న అమ్మోనియంక్లోరైడ్ అనే వాయువు పెద్ద మొత్తంలో విడుదలైన ఘటనపై నవయువసమాఖ్య జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఒక నిజనిర్ధారణ కమిటీ ఏర్పడి 10-10-13న నెల్లూరు పట్టణంలో పర్యటించి బాధితులను, సంబంధిత అధికారులను కలిసి వాస్తవాలు సేకరించింది.

నిజనిర్ధారణకమిటీ స్థానిక రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వైద్యులైన డా॥ఎస్.రవీంద్రగారిని, అదే ఆసుపత్రిలో లైబ్రరీ ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్న ఎన్.దశరథరామయ్యను, విజయాకేర్ ఆసుపత్రిలో ప్రధాన వైద్యులు డా॥విజయకుమార్‌గార్ని కలిసి వివరాలు సేకరించింది. విజయాకేర్ ఆసుపత్రిలో, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న దాదాపు 35మంది మహిళా కార్మికులను కలిసి పరామర్శించి వారినుంచి, వారి బంధువులనుంచి ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించింది. జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారి ఆఫీసులో లేనందున ఫోన్‌లో సంప్రదించగా తను ఘటనా స్థలంలో విచారణలో వున్నానని, విచారణ పూర్తికాకుండా ఏమీ చెప్పలేనని అన్నారు. ఫ్యాక్టరీ యజమాని అబ్దుల్ అజీజ్‌ని ఫోన్‌లో సంప్రదించగా తాను ఇప్పుడు మాట్లాడే పరిస్థితిలో లేనని బదులిచ్చారు.

ఫ్యాక్టరీలో రొయ్యల శీతలీకరణకు సంబంధించిన యంత్రాలలో వాడే శీతలీకరణ పదార్థం అమోనియం క్లోరైడ్ ఒక వాల్వువద్దనుండి 2,3 రోజులుగా కొద్దికొద్దిగా లీకవుతూవున్నది. ఈ విషయం తెలిసినప్పటికీ, యాజమాన్యం దానికి తగిన మరమ్మత్తులు చేయించకుండా నిర్లక్ష్యంగా వున్న ఫలితంగా 9-10-13 ఉదయం ఒక్కసారిగా పెద్దమొత్తంలో అమ్మోనియంక్లోరైడ్ విడుదలై పనిలో మునిగివున్న మహిళా కార్మికులపై తీవ్ర ప్రభావం చూపటంతో వారంతా అస్వస్థతకు గురయ్యారు. అనేకమంది స్పృహ కోల్పోయారు. తోటికార్మికులు, పరిసరప్రాంత ప్రజలు వేగంగా స్పందించి వీరిని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలకు, విజయాకేర్ ఆసుపత్రికి, జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు ఆటోలలో, అంబులెన్స్‌లలో తరలించారు. రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలోని డాక్టర్లు యుద్ధప్రాతిపదికన స్పందించి ఐసియు మొత్తాన్ని మహిళా కార్మికులకు కేటాయించి, వచ్చిన కార్మికులందరికి సత్వర చికిత్స చేయడంతో వారంతా ప్రాణాపాయంనుంచి బయటపడ్డారు. విజయాకేర్ ఆసుపత్రిలో 19మంది, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో షుమారు 20మంది ఇంకా చికిత్స పొందుతూనే వున్నారు.

జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారులు ప్రతి మూడు నెలలకి ఒకసారి కర్మాగారాన్ని తనిఖీ చేయవలసిన తమ బాధ్యతను ప్రక్కనబెట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వాయువు వెలువడుతుందని తెలిసినా బాధ్యతారహితంగా ప్రవర్తించారు.

మహిళా కార్మికులు చెప్పిన దాని ప్రకారం గత రెండు, మూడు నెలల వరకూ రోజుకు 150 రూ॥ చొప్పున; ఆ తర్వాత రోజుకు 170 రూ॥ల చొప్పున మేస్త్రీల చేతులమీదుగా వీరంతా కూలీ పొందుతున్నారు. రవాణా ఛార్జీలు మినహాయించుకొని మేస్త్రీలు వీరికి చెల్లిస్తున్నారు. వీరికి రాష్ట్ర, కేంద్రప్రభుత్వాల కార్మికచట్టాలేవీ అమలుకావడంలేదు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాల గురించి వీరికి తెలియదని చెప్పారు.

నిజనిర్ధారణ కమిటి ఈ క్రింది డిమాండ్స్ తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసింది.

– కర్మాగారంలో ప్రమాదానికి బాధ్యులైన యాజమాన్యాన్ని, పర్యవేక్షించటంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వాధికారులను శిక్షించాలి. బాధితులకు ఉచిత వైద్యంతోపాటుగా పరిహారం చెల్లించాలి.

– కార్మికులందరినీ అవుట్‌సోర్సింగ్ పద్ధతిలోగాక ఫ్యాక్టరీ కార్మికులుగా గుర్తించాలి. దళారీ వ్యవస్థను తొలగించాలి.

– కార్మికులందరికీ కనీస వేతన చట్టాన్ని అమలుచేయాలి. పిఎఫ్, ఇఎస్ఐలను అందించాలి.

ఈ కమిటీలో ఎల్.లక్ష్మీరెడ్డి(ఎన్‌వైయస్) కన్వీనర్‌గా ఎం.వి.కృష్ణయ్య(ఒపిడిఆర్), రమణయ్య (రైతుకూలీ సంఘం-ఆం.ప్ర), శ్యామల (స్త్రీవిముక్తి సంఘటన), కృష్ణప్రసాద్ (పిడిఎస్ఓ)లు సభ్యులుగా వున్నారు. ★

# ప్రాంతీయ విద్వేషాలు ప్రజాసమస్యలను పరిష్కరించవు



సభలో ప్రసంగిస్తున్న విజయకుమార్

**ఒంగోలు, 26-9-13 :**

సిపిఐ(ఎం-ఎల్) ప్రకాశంజిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంతపేట రంగాభవన్‌లో సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ ఎస్.లలితకుమారి అధ్యక్షతన "ప్రాంతీయ విద్వేషాలు రగిల్చే పాలకవర్గ ముఠాల కుట్రలకు బలికాకండి" అనే పిలుపుతో సభ నిర్వహించారు.

ఈ సభలో సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ 66సంవత్సరాల 'స్వతంత్ర'పాలన తరువాత కూడా సామాన్య ప్రజలెదుర్కొంటున్న మౌలికసమస్యలు ఏవీ పరిష్కారంకాకపోగా మరింతగా పెరిగాయని, దేశంలో అత్యంత ముఖ్యమైన వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చి దివాలా తీయిస్తున్నారని, ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసి నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నారని, ఈ పరిస్థితులు ప్రజా తిరుగుబాటులుగా మారకుండా ఉండేందుకే రాష్ట్రంలో ప్రాంతీయ ఉద్యమాలను రెచ్చగొడ్తున్నారని, ప్రజాగ్రహాన్ని ప్రక్కదారి పట్టించి తమ పబ్బం గడుపుకోవడానికి పాలకవర్గాలు పన్నిన కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. స్వయం నిర్ణయాధికారం కలిగిన జాతీయ రాజ్యాల ఐచ్ఛిక సమాఖ్యగా దేశం వుండాలనేది కమ్యూనిస్టు విప్లవకారుల (తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010